నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 30-1-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 148 | పేజీలు: 4 | వెల: రూ.1/-

తెలంగాణలో ఫిబ్రవరి 1 నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

హైదరాబాద్, జనవరి 29:కరోనా థర్డ్ వేవ్ ఉధృతి నేపథ్యంలో తెలంగాణలో పాఠశాలలు మూతపడిన సంగతి తెలిసిందే. కాగా కరోనా వ్యాప్తి తగ్గుముఖంపడుతోన్న నేపథ్యంలో పాఠశాలలను తెరవనున్నారు. దాంతో తెలంగాణలో ఈ నెల 31నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఈ మేరకు రేపటితో సెలవులు ముగియనున్నాయి. ఎల్లుండి నుంచి స్కూల్స్ తెరుచుకోనున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ సూచనలతో స్కూల్స్ తెరవాలని నిర్ణయం తీసుకున్నారు. కరోనా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అందరూ తప్పనిసరిగా మాస్క్ లను ధరించాలని వెల్లడించింది.

నేడు టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం

హైదరాబాద్, జనవరి 29: సీఎం కెసిఆర్ అధ్యక్షతన రేపు (ఆదివారం) మధ్యాహ్నం 1 గంటకు ప్రగతి భవన్ లో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం కానున్నది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్న సందర్భంగా.. లోక్ సభ, రాజ్యసభల్లో టీఆర్ఎస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన పలు అంశాలు, కేంద్రం నుంచి సాధించాల్సిన పెండింగ్ సమస్యలపై ఎంపీలకు నివేదికలు అందజేస్తారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర హక్కులను సాధించుకునేందుకు ఉభయ సభల్లో టీఆర్ఎస్ పార్టీ ఎంపీలు, కేంద్రంపై అనుసరించాల్సిన పోరాట పంథాపై సీఎం కేసిఆర్ ఎంపీలకు సూచనలు, ఆదేశాలు చేయనున్నారు.

వైద్య ఆరోగ్యశాఖపై కేసీఆర్ ప్రత్యేక దృష్టిపెట్టారు: హరీష్

ఖమ్మం, జనవరి 29:: వైద్య ఆరోగ్య శాఖపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం నాడు సత్తుపల్లిలో హరీష్‌రావు పర్యటించారు. వంద పడకల ఆస్పత్రికి హరీష్ రావు శంకుస్థాపన చేశారు. అనంతరం హరీష్? మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కిట్?లు వచ్చిన తర్వాత వందశాతం ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీలు పెరిగాయన్నారు. భారతదేశంలో ఎక్కడాలేని విధంగా కళ్యాణ లక్ష్మీ పథకం అమలు చేశామని, కళ్యాణ లక్ష్మీ పథకం కింద 10 లక్షల పెళ్లిళ్లు జరిగాయని తెలిపారు. సంక్షేమ ప్రభుత్వానికి చిరునామాగా కేసీఆర్ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. అంతేకాకుండా హైదరాబాద్ తర్వాత ఒక్క ఖమ్మంలోనే కేతల్యాబ్ ఏర్పాటు చేసినట్లు హరీష్ వెల్లడించారు. రాష్ట్రంలో ఫీవర్ సర్వే బాగా జరుగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ వైరస్ వ్యాప్తిని కట్టడి చేయాలన్నారు. ప్రజల సహకారం ఉంటే త్వరలోనే కరోనా వేవ్ నుండి బయటపడవచ్చని హరీష్ అన్నారు.

ఏపీ, తెలంగాణ కు మరో వారధి.. సోమశిలపై బ్రిడ్జికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జనవరి 29:తెలుగు రాష్ట్రాలకు మరో జాతీయ రహదారి అందుబాటులోకి రాబోతోంది. ఈ జాతీయ రహదారి నిర్మాణం కోసం అధికారులు ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేశారు. ముఖ్యంగా తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా, నంద్యాల బైపాస్ రోడ్డు వరకు ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి రూపొందించిన ప్రణాళికను కేంద్ర ఉపరితల రవాణా శాఖ సమ్మతించింది. ఈ మేరకు రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సెంట్రల్ అప్రూవల్ జిపిఆర్ ఫర్ న్యూ నేషనల్ హైవే సంస్థ ఆమోదిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రణాళిక ప్రకారం.. ఏపీ, తెలంగాణలను అనుసంధానిస్తూ 174 కి.మీ. మేర జాతీయ రహదారి (ఎన్‌హెచ్-167కె)ను రూ.600 కోట్లతో నిర్మిస్తారు. తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి సమీపంలోని కొట్రా జంక్షన్ నుంచి ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాల వరకు నిర్మించాలని నిర్ణయించారు. ఏపీ పరిధిలో కర్నూలు జిల్లాలోని ఎర్రమఠం, ముసలి మడుగు, ఆత్మకూరు, వెలుగోడు, సంతజుటూరు, కరివెనపై బైపాస్ రోడ్లు నిర్మిస్తారు.

అలాగే తెలంగాణ పరిధిలో కల్వకుర్తి, తాడూరు, నాగర్ కర్నూలు, కొల్లాపూర్‌లలో బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణానదిపై రూ.600 కోట్లతో ఓ వంతెననూ నిర్మిస్తారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లా సిద్ధేశ్వరం.. తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల మధ్య దాదాపు 2 కి.మీ. మేర ఈ వంతెన నిర్మాణం జరుగుతుంది. కేంద్రం డీపీఆర్‌ను ఆమోదించడంతో త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాలని భావిస్తున్నామని ఎన్‌హెచ్‌ఏఐ అధికార వర్గాలు తెలిపాయి. ఈ జాతీయ రహదారి పూర్తయితే హైదరాబాద్- తిరుపతి మధ్య 42 కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తిరుపతికి కర్నూలు మీదుగానే వెళ్ళాలి. ఈ ప్రాజెక్టు పూర్తయితే కల్వకుర్తి, కొల్లాపూర్ మీదుగా నంద్యాల వెళ్లి అక్కడ కర్నూలు- తిరుపతి జాతీయ రహదారికి అనుసంధానం అయ్యే హైవే మీదుగా వెళ్లిపోవచ్చు. ప్రస్తుతం హైదరాబాద్- నంద్యాల మధ్య దూరం 296 కిలోమీటర్లు, కొత్త జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే అది 254 కిలోమీటర్లకు తగ్గుతుంది. అంతేకాకుండా ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న సోమశిల వంతెన నిర్మాణం కూడా పూర్తి కానుంది. వీటిని జాతీయ రహదారి-40 జంక్షన్‌కు అనుసంధానం చేయనున్నారు.

ముఖ్యంగా సోమశిల సమీపంలో కృష్ణానదిపై రీ అలైన్‌మెంట్ బ్రిడ్జి నిర్మిస్తారు. కర్నూల్ జిల్లాలోని ఎర్రమఠం, ముసలి మడుగు, ఆత్మకూరు, వెలుగోడు, సంతజుటూరు, కరివెనపై నంద్యాల బైపాస్ రోడ్ల వరకు బైపాస్‌ల రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నట్లు- ఉత్తర్వులలో పేర్కొన్నారు. నంద్యాల బైపాస్ చివరలోని జాతీయ రహదారి-40 జంక్షన్‌కు దీన్ని అనుసంధానం చేయనున్నట్లు తెలుస్తుంది. అలాగే రెండు రాష్ట్రాలను కలుపుతూ కొత్తగా నిర్మిస్తున్న కొల్లాపూర్(167కే) జాతీయ రహదారి దాదాపు 173.73 కిలోమీటర్ల పొడవు ఉండనుంది. ఈ రహదారిపై 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే విధంగా నిర్మాణం చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో బైపాస్, రీ అలైన్‌మెంట్ల నిర్మాణాలూ ఉంటాయని అధికారులు తెలిపారు. కొల్లాపూర్ (167కే) జాతీయ రహదారి నిర్మాణం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సమీపంలోని కొట్రా జంక్షన్ నుంచి ప్రారంభమవుతుంది. కల్వకుర్తి, తాడూరు, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ ప్రాంతాల్లో బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు.

అర్హులందరికీ బూస్టర్ డోస్: మంత్రి హరీశ్ రావు

ఖమ్మం, జనవరి 29: రాష్ట్రంలోకోవిడ్ వ్యాప్తి నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుతెలిపారు. వ్యాక్సిన్ పంపిణీలో భాగంగా అర్హులైన వారందరికీ బూస్టర్ డోస్ ఇస్తున్నామని తెలిపారు. సత్తుపల్లిలో 100శాతం కోవిడ్ వ్యాక్సిన్ రెండు డోసులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు.జిల్లాలోని సత్తుపల్లిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి హరీశ్ రావు శనివారం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ తో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రానికి డయాలసిస్ కేంద్రం, ఐసీయూ వార్డులు తీసుకొచ్చిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా

ఎద్దుల బండిని ఢీకొట్టిన అంబులెన్స్

సంగారెడ్డి,జనవరి 29:: చౌటకుర్ మండలం శివంపేట వద్ద చెరుకుతో నిండిన ఎద్దుల బండిని 108 అంబులెన్స్ ఢీకొట్టింది. ప్రెగ్నెన్సీ మహిళను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలయ్యాయి. మరో అంబులెన్స్‌లో గాయపడిన మహిళను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు.

చరిత్రలో నేటినిజం

తే॥ భారత శేష చరిత్రను
పరుగ శోధనము చేసి పోజూపుయమా
పేరుల నాథగ ప్రాయుగ
నారాధన చేయుచుంటి "నమలేంబుగుమా"కే !!

(జనవరి 30 చరిత్రశోధకుడు అమలేందుగుహ జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210

అభివృద్ధిలో సంచలనాలు సృష్టించిన నాయకుడు కేసీఆర్ : జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 29:కాళేశ్వరం ప్రాజెక్టును సాకారం చేసిన నాయకుడు, సంక్షేమం, అభివృద్ధిలో సంచలనాలను సృష్టించిన నాయకుడు కేసీఆర్ అని రాష్ట్ర మంత్రి జగదీశ్ రెడ్డి కొనియాడారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబంపై కొందరు అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. కేసీఆర్ నిప్పులాంటి వ్యక్తి అని, ఆయనను టచ్ చేస్తే భస్మమైపోతార న్నారు. పైరవీలు, దందాలు చేసినోళ్లే ఊర కుక్కల్లా మొరుగుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం చిన్న రాష్ట్రమైనా.. అభివృద్ధిలో మాత్రం పరుగు పెడుతోందన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణలో 24 గంటల విద్యుత్ ఉండేదా అని ప్రశ్నించారు. ప్రతి ఇంటికి మంచినీరు అందేదా అని అడిగారు. దళారులకు దోచి పెట్టడం, వారితో అంటకాగడం తప్ప బీజేపీ నేతలు చేసిందేముందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్ లో పేదరికం మరింత పెరిగిందని చెప్పారు. మోదీ పాలనలో దళారులు కుబేరులయ్యారని, దేశం మాత్రం దివాలా తీసిందన్నారు.

అరవింద్ పై ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 29:బీజేపీ ఎంపీ అరవింద్ పై ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తీవ్రంగా ఫైర్ అయ్యారు. ఆర్మూర్ లో అరవింద్ చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. రైతులను ఖలిస్థాన్ ఉగ్రవాదులతో పోల్చడంపై జీవన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీని మించిన ఉగ్రవాద పార్టీ మరేదీ లేదని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ ఒక ఉగ్రవాదుల కర్మాగారంలా మారిందని ఆరోపించారు. ఉగ్రవాద స్వభావం కలిగిన వ్యక్తులు రైతులను ఉగ్రవాదులతో ఎలా పోలుస్తారని ప్రశ్నించారు.

మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసనలు చేసిన 700 మంది రైతులను బీజేపీ శ్మశానానికి పంపిందని విమర్శించారు. నిజమైన దేశ ద్రోహులు బీజేపీ నేతలేనని అన్నారు. ఎన్నికలు వచ్చాయంటే పాకిస్థాన్, ఖలిస్థాన్ అంటూ ప్రజలను రెచ్చగొడుతుంటారని ధ్వజమెత్తారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నాయి కాబట్టే పెట్రోల్ ధరలను పెంచడం లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ పై బీజేపీ నేతలు వాడుతున్న భాష సరిగా లేదని పద్ధతి మార్చుకోకపోతే టీఆర్ఎస్ సైనికులు ఊరుకోరని హెచ్చరించారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామన్న అరవింద్.. ఎన్నికల సమయంలో బాండ్ పేపర్ రాసిచ్చి దాన్ని నిలబెట్టుకోనందుకే రైతులు నిలదీస్తున్నారని చెప్పారు.

నదిలో బోటు బోల్తా - ఎనిమిది మంది సేఫ్ - ఇద్దరు గల్లంతు

మధ్యప్రదేశ్, జనవరి 29:పది మందితో వెళ్తున్న బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మందిని రక్షించారు. కాగా ఇద్దరు గల్లంతయ్యారు. ఈ ప్రమాదం మధ్యప్రదేశ్ భింద్ జిల్లాలోని సింధ్ నదిలో జరిగింది.

నది ఒడ్డుకు కేవలం మీటర్ల దూరంలో ఉండగా ఈ ప్రమాదం జరిగిం ది. దాంతో ఒడ్డున వున్న పలువురు వ్యక్తులు వారిని రక్షించేందుకు నదిలో దూకారు. కాగా ఎనిమిది మందిని రక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌కు చెందిన స్థానిక నివాసి ద్రౌపతి బాఘేల్ (16), ఓం బాఘేల్ (13) గల్లంతయ్యారు. వారి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ నరేంద్ర సింగ్ కుష్వాహా వెల్లడించారు. భింద్ పట్టణానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రదేశంలో ప్రమాదం జరిగింది.

ఢిల్లీలో బీటింగ్ రిట్రీట్ వేడుకలు

న్యూఢిల్లీ, జనవరి 29:దేశ రాజధాని ఢిల్లీలో బీటింగ్ రిట్రీట్ వేడుకలు జరుగుతున్నాయి. ఈనెల 23న ప్రారంభమైన రిపబ్లిక్ డే వేడుకలు ప్రారంభమయ్యాయి. బీటింగ్ రిట్రీట్ తో ఈ వేడుకలు ముగియనున్నాయి. ఈ వేడుకలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. బీటింగ్ రిట్రీట్ లో ప్రముఖులు పాల్గొననున్నారు. బీటింగ్ రిట్రీట్ వేడుక విజయ్ చౌక్‌లో, రిపబ్లిక్ డే సెలబ్రేషన్ 2022లో భాగంగా నిర్వహించబడుతుంది. ఈ వేడుకల్లో రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొన్నారు. రాష్ట్రపతి భవన్, నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్, పార్లమెంట్ హౌస్‌లలో బీటింగ్ రిట్రీట్ వేడుక కోసం ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఈ వేడుక దృష్ట్యా ఈరోజు మధ్యాహ్నం 2గంటల నుండి రాత్రి 9:30 గంటల వరకు విజయ్ చౌక్ సాధారణ ట్రాఫిక్ కోసం మూసివేశారు.

శంషాబాద్ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ తనిఖీలు

హైదరాబాద్, జనవరి 29: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫారిన్ కరెన్సీని అధికారులు పట్టుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి వద్ద 33000 సౌదీ అరేబియన్ దాలర్స్‌ను కస్టమ్స్ గుర్తించారు. దీని విలువల 6.35 లక్షలు ఉంటుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఫారెన్ కరెన్సీ సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడారం జాతరను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు: మంత్రుల సమీక్ష

ములుగు, జనవరి 29:: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి పొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను ఈ సంవత్సరం మరింత ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. శనివారం మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ శాశ్వత ప్రాతిపదికన మేడారంలో పనులు చేపట్టినట్టు తెలిపారు. మేడారం మహాజాతరకు కోటి ముప్పై లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నామని చెప్పారు.ప్రతీ భక్తుడికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.ఆదివాసీల అభిప్రాయాలకు గౌరవం ఇస్తామని, వారి సంప్రదాయాలకు ఆటంకం కలగకుండా చూస్తామన్నారు.కానీ కొందరు జాతరను కూడా రాజకీయం చేయాలని చూస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి ఆరోపించారు.

ఇవి కూడా చదవండిఎఎజీణవ అజీజూబితినీనిఅఖిలేశ్‌కు నఖ్వీ సూటి ప్రశ్నఅయినా ప్రభుత్వం భక్తుల మనోభావాలకు అనుగుణంగానే జాతర నిర్వహిస్తుందన్నారు. కాగా జాతర ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూపాయి కూడా నిధులు రావడం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో శ్రద్ధతో జాతర నిర్వహణకు ఆదేశించారని చెప్పారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ మేడారం మహాజాతర కోసం ప్రభుత్వం 350కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నదని చెప్పారు. ఇప్పటికే కొన్ని డిపార్ట్ మెంట్లలో పనులు పూర్తయ్యాయి, ఇంకా మిగిలి ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం 4వేల బస్సులు, పదివేల మంది సిబ్బందితో రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. జంపన్న వాగులో స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశామని, ఎవరికీ ఇబ్బందులు రాకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. లోపాలు ఉంటే సరిదిద్దుకుంటామని మంత్రి వివరించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు.ఆందోళన చేస్తున్న ఆదివాసి సంఘాలతో మాట్లాడతామని కూడా మంత్రి వెల్లడించారు. కాగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ఆదివాసి సంప్రదాయాలకు అనుగుణంగా జాతర నిర్వహిస్తామని స్పష్టం చేశఆరు. పూజారుల మనోభావాలు గౌరవిస్తామని, ఆదివాసి, గిరిజన ఆరాధ్యదైవమైన జాతరకు 350 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఎంతమంది భక్తులు వచ్చినా అసౌకర్యం కలగనివ్వమని,అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు.

మేడారం జాతరకు 10వేల మంది పోలీస్ సిబ్బంది : డీజీపీ

హైదరాబాద్, జనవరి 29:మేడారం మహా జాతర కోసం 10 వేల మంది వివిధ హోదాల్లోని పోలీస్ సిబ్బంది సేవలు అందించడం జరుగుతుందని రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర ఫిబ్రవరి 16 నుంచి 19 వరకు జరుగనుంది. మేడారం మహాజాతరకు ఇప్పటికే ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ జాతరకు రూ.75 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

ఈ జాతరపై ఈరోజు డీజీపీ మహేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగకుండా చర్యలు తీసుకుంటారన్నారు. అదే విధంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గద్దెల దగ్గర పూజారులతో సత్సంబంధాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జాతరకు వచ్చే ప్రతి వెహికల్ ను సక్సెస్ గా లోపలకి పంపితే ట్రాఫిక్ క్లియర్ అయినట్టే.. ఇబ్బంది ఉండదని, రోడ్డు మీద వాహనాలు నిలవకుండా చూసుకోవాలన్నారు. వీఐపీ, వీవీఐపీలు, ప్రోటోకాల్ లో ఉన్న వారి వాహనాలతో సామాన్యులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తూ.. క్లియర్ చేస్తూ జాతర విజయవంతం చేయాలని ఆదేశించారు. జాతర విధుల్లో ఉండే పోలీసులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తే, డ్యూటీ సక్సెస్ గా చేయడం జరుగుతుందని..అప్పుడు జాతర విజయవంతం అవుతుందని డీజీపీ మహేందర్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.

రంగారెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

రంగారెడ్డి, జనవరి 29:: పట్టణ ప్రగతిలో భాగంగా శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రాగునీరు, డ్రైనేజి,వైకుంఠ ధామాలు, కాబ్రాస్థాన్, పార్కులు, బస్తీ దవాఖానాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, మున్సిపల్ శాఖ మంత్రి కె. తారక రామారావు పేర్కొన్నారు. పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు.శనివారం జిల్లాలోని పలు నియోజక వర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా తుక్కుగూడ మునిసిపాలిటీలో 4 కోట్ల 50 లక్షల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

అలాగే జిల్లాలోని మాహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడ, జల్ పల్లి మునిసిపాలిటీలు, బడనీగ్ పేట్,మీర్ పేట్ కార్పొరేషన్ల పరిధిలలో 371 కోట్ల 9 లక్షల రూపాయల వ్యయంతో రక్షిత మంచినీటి పథకాలకు, రహదారుల విస్తరణ పనులకు,వరద నీటి కాలువలు, నాలాల పనులకు, సమీకృత వెజ్ ,నాన్ వెజ్ మార్కెట్ పనులకు కూడా మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు చేశారు, బడనీగ్ పేట్ లో పట్టణప్రాథమిక కేంద్ర భవనాన్ని కూడా మంత్రి కేటీఆర్ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. జల్ పల్లి మునిసిపాలిటీలో 111 కోట్ల 76 లక్షల వ్యయంతో రహదారుల విస్తరణకు, సమీకృత మార్కెట్ నిర్మాణానికి, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి, డ్రైనేజి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

అనంతరం జల్ పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ తుక్కుగూడ మునిసిపాలిటీలో ఏర్పాటు చేయనున్న సమీకృత మార్కెట్లో కూరగాయలతో పాటు మాంసం విక్రయాలకు సంబంధించి మార్కెట్‌లో సదుపాయాలు కల్పించనున్నామని 108 గదులతో వేర్వేరుగా వెజ్, నాన్ వెజ్ బ్లాక్‌లను నిర్మిస్తారు. 78 గదులతో కూరగాయల బ్లాక్, 30 గదులతో మాంసాహార బ్లాక్ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. జల్‌పల్లిలో ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లువస్తున్నాయని, త్వరలో జల్‌పల్లిలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తామని, రూ.29 కోట్లతో జల్‌పల్లికి మరో రోడ్డు మంజూరు చేస్తామన్నారు., రాష్ట్రవ్యాప్తంగా 26 వేల స్కూళ్లలో మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. బడనీగ్ పేట్,మీర్ పేట్ కార్పొరేషన్ల పరిధిలలో రక్షిత మంచినీటి పథకాలకు, రహదారుల విస్తరణ పనులకు,వరద నీటి కాలువలు, నాలాల పనులకు, సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులకు, మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్ రెడ్డి, జిల్లా జెడ్పీ చైర్మన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్ రెడ్డి, ఎగ్గే మల్లేష్, జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీఎమ్మెల్యే తీగల క్రిష్ణా రెడ్డి, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్,అడిషనల్ కలెక్టర్ ప్రతిక్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ముగిసిన టోనీ కస్టడీ

హైదరాబాద్, జనవరి 29:డ్రగ్ కేసులో ప్రధాన సూత్రధారి టోనీ కస్టడీ మొదటి రోజు ముగిసింది. మొదటి రోజు విచారణలో టోనీ వివరాలను పోలీసులు సేకరించారు. వ్యక్తిగత వివరాలతో స్టేట్‌మెంట్‌ను స్పెషల్ టీమ్ రికార్డ్ చేసింది. టోనీ ఏజెంట్స్, డ్రగ్ నెట్‌వర్క్ బ్రేక్ చేసే కోణంలో ప్రశ్నించారు. ముంబయి, గోవా ఏజెంట్స్ చైన్‌లో హైదరాబాద్ లింకులపై ఆరా పోలీసులు తీశారు. ఇంటర్నేషనల్ డ్రగ్ రాకెట్ టార్గెట్‌గా చేసుకుని సిటీ పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేశారు. స్టార్ బాయ్ కోణంలో ఇంగ్లీషు భాషలోనే పలు ప్రశ్నలను పోలీసులు సంధించారు. స్టార్ బాయ్ టార్గెట్‌గా ట్రాన్సలేటర్‌తో ప్రశ్నలను పోలీసులు అడిగారు. ఇప్పటికే ముంబైలోని అందేరిలో పలువు కీలక ప్లేడర్ల సమాచారాన్ని ఔఅకి సిటీ పోలీసులు చేరవేశారు.

నివారించదగిన కుష్టువ్యాధికి చికిత్స కూడా ఉంది

(30 జనవరి 'ప్రపంచ కుష్టు నిర్మూలన దినం' సందర్భంగా)

విశ్వ ప్రజలు, సామాజిక వ్యవస్థ చిన్నచూపు చూసిన భయంకరమైన కుష్టువ్యాధి అవతరించి పోలేదని, అలాంటి 20 రకాలైన ఉష్ణమండల రోగాలకు ఔషధాలు ఉన్నాయని, వాటిని కట్టడి చేయడానికి ఔషధ కంపెనీలతో పాటు ప్రభుత్వాలు చొరవ తీసుకొని ముందుకు సాగాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తున్నది. ముఖ్యంగా కుష్టు వ్యాధిగ్రస్తుల హక్కుల పరిరక్షణ, వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్స మార్గాలను సామాన్యులకు అవగాహన పరిచే లక్ష్యంతో ప్రతి ఏటా జనవరి చివరి ఆదివారం, అనగా 30 జనవరి 2022న 'ప్రపంచ కుష్టు నిర్మూలన దినం' పాటించుట జరుగుతోంది. ప్రపంచ కుష్టు నిర్మూలన దినం-2022 సందర్భంగా 'యువైటెడ్ ఫర్ డిగ్నిటి (గౌరవం కోసం ఐక్యమవుదాం)' అనే నినాదం తీసుకొని కార్యక్రమాలు చేపడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించుటతో పాటు సమాజంలో కుష్టు నిర్మూలన పట్ల చర్యలు తీసుకోవడానికి ఈ వేదికలను ఉపయోగిస్తారు. నేడు కుష్టు వ్యాధిగ్రస్తులు, సాధారణ పౌరులు కూడా రోగాన్ని నిర్లక్ష్యం చేయడం చూస్తున్నాం.

మైకోబ్యాక్టీరియమ్ లెప్రే లేదా హన్‌సెన్ బాసిల్లస్ బ్యాక్టీరియా వల్ల సంక్రమించే అంటువ్యాధిగా (దగ్గినపుడు లేదా తుమ్మినపుడు గాలిలో తుంపర్ల ద్వారా) కుష్టువ్యాధి గుర్తించబడింది. చర్మం, శ్వాసనాళ కణజాలం, కాళ్ళు, నరాల సంబంధ కుష్టు వ్యాధిని తొలి దశలో గుర్తించని యెడల శాశ్వత అంగవైకల్యం కూడా ఏర్పడవచ్చు. నెమ్మదిగా పునరుత్పత్తి చేయడం వలన వ్యాధి లక్షణాలు కనపడటానికి కనీసం 1 - 5 సంవత్సరాలు పడుతుంది. కుష్టు వ్యాధి లక్షణాల్లో చర్మం ఎర్రబారి స్పర్శను కోల్పోవడం, కీళ్ళ నొప్పులు, బరువు తగ్గడం, కాళ్ళ చేతులు బలహీన పడడం లాంటివి కనిపిస్తాయి. మల్టీ డ్రగ్ థెరపీ వైద్యంతో 6 - 12 మాసాల్లో నయం చేయగల కుష్టు వ్యాధిగ్రస్తులను సమాజం వెలివేయడం లాంటి మూఢనమ్మకాలు అవాంఛనీయం. వ్యాధిగ్రస్తులను తరుచుగా తాకడంతో ఇతరులకు వ్యాధి సంక్రమిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఏడాదిలో 2.1 లక్షల మందికి కుష్టు వ్యాధి సోకడం, భారత్‌లో ప్రతియేటా లక్ష కేసులు నమోదు అవుతున్నాయి. ఇప్పటి వరకు 4 మిలియన్ల రోగులకు చికిత్సతో నయం చేయడం జరిగింది. 2018 గణాంకాల ప్రకారం 127 దేశాల్లో కనిపించే కుష్టు వ్యాధిగ్రస్తుల్లో 80 శాతం భారత్, బ్రెజిల్ మరియు ఇండొనేషియాల్లో నమోదు అవుతున్నాయి. కుష్టువ్యాధి నిర్మూలించగల, చికిత్సతో నయం చేయగల వ్యాధి. పేదరిక నిర్మూలన, అక్షరాస్యత, అవగాహన లాంటివి కుష్టువ్యాధి వ్యాప్తిని అరికడతాయి. కుష్టువ్యాధి కట్టడికి ప్రభుత్వాలు, ఫార్మా కంపెనీలు, యన్‌జిఓలు, పౌర సమాజం సమన్వయంతో పని చేయడం తప్పనిసరి. ఆధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో కుష్టువ్యాధి మన లాంటి దేశాల్లో అధికంగా కనిపించడం అత్యంత విచారకరం. భవిష్యత్తులో కుష్టువ్యాధి వ్యాప్తిని అరికట్టడం, వ్యాధిని నయం చేయడం, వ్యాధిగ్రస్తులను మానవత్వంతో చూడడం, సకాలంలో వైద్యసహాయం అందించడం, సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం లాంటి చర్యలు సత్ఫలితాలు ఇస్తాయని నమ్మతూ, కుష్టువ్యాధి లేని సమాజ నిర్మాణానికి తోడ్పడదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఉమ్మడి ఫలిత (ఔట్‌కమ్) ప్రకటనః భారత రిపబ్లిక్, యునైటెడ్ కింగ్డమ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తొలి విడత చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 29:స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కోసం భారత్ రిపబ్లిక్, యునైటెడ్ కింగ్డమ్ మధ్య తొలి విడత చర్చలు ముగిశాయి. కోవిడ్ మహమ్మారి సవాళ్ళు విసిరినప్పటికీ దాదాపు 2 వారాల పాటు దృశ్యమాధ్యమం ద్వారా ఈ చర్చలు నడవడంతో తొలి విడత చర్చల ప్రాముఖ్యతను ఇరు పక్షాలూ గుర్తించాయి.

ఈ విడతలో రెండు పక్షాలకు చెందిన సాంకేతిక నిపుణులు ఒక దగ్గర కూడి 36 వేర్వేరు సెషన్లలో 26 విధానపరమైన రంగాలకు సంబంధించిన అంశాలు చర్చించారు. ఇందులో వస్తువుల వ్యాపారం, ఆర్థిక సేవలు, టెలికమ్యూనికేషన్లు సహా సేవలలో వాణిజ్యం, పెట్టుబడులు, మేథో సంపత్తి, కస్టమ్స్, ట్రేడ్ ఫెసిలిటేషన్, పారిశుద్ధ్యం, ఫైటో శానిటరీ చర్యలు, వాణిజ్యానికి సాంకేతిక అడ్డంకులు, పోటీ, జెండర్, ప్రభుత్వ సేకరణ, ఎస్ఎంఇలు, నిలకడ, పారదర్శకత, వాణిజ్యం ద అభివృద్ధి, భౌగోళిక సూచీలు, డిజిటల్ తదితర అంశాలు ఉన్నాయి. చర్చలు సఫలవంతం అవడమే కాక, ప్రపంచంలోని వరుసగా 5వ, 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి సమగ్ర ఒప్పందాన్ని సాధించాలనే ఉమ్మడి ఆశయాన్ని ప్రతిబింబించాయి. తొలి రౌండ్‌లో జరిగిన సానుకూల చర్చలు యుకె, భారత్‌లు సానుకూల, సమర్థవంతమైన పురోగతిని సాధించడానికి పునాది వేశాయి.

రెండవ విడత చర్చలు 7-18 మార్చి 2022 మధ్య చోటు చేసుకోనున్నాయి. ఇరు పక్షాలూ కూడా ఈ చర్చలను 2022 చివరి నాటికి ముగించాలనే ఉమ్మడి ఆశయంతో ఉన్నాయి. ఒక సమగ్ర ఒప్పందాన్ని సాధించాలని ఇరు పక్షాలు చేస్తున్న కృషిలో భాగంగా, ప్రధాన సంధానకర్తలు తాత్కాలిక ఒప్పందం వల్ల లాభాలను పరిశీలిస్తారు.

ఫిలిప్పీన్స్‌కు సముద్ర ఆధారిత బ్రహ్మోస్ క్షిపణుల ఎగుమతికి ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 29:బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (బీఏపీఎల్) ఫిలిప్పీన్స్‌కు షోర్ బేస్డ్ యాంటీ షిప్ మిస్సైల్ సిస్టమ్‌ను సరఫరా చేయడానికి జనవరి 28, 2022న రిపబ్లిక్ ఆఫ్ ఫిలిప్పీన్స్ దేశ జాతీయ రక్షణ విభాగంతో ఒక ఒప్పందంపై సంతకం చేసింది. బీఏపీఎల్ సంస్థ అనేది డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సంయుక్త వెంచర్ కంపెనీ. బాధ్యతాయుతమైన రక్షణ ఎగుమతులను ప్రోత్సహించే భారత ప్రభుత్వ విధానానికి ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన ముందడుగు.

'పరీక్షా పె చర్చ 2022' 5వ ఎడిషన్‌లో పాల్గొనేందుకు నమోదు ఫిబ్రవరి 3, వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, జనవరి 29:'పరీక్షా పె చర్చ 2022' 5వ ఎడిషన్‌లో పాల్గొనేందుకు నమోదు తేదీ ఫిబ్రవరి 3, 2022 వరకు పొడిగించబడింది. విద్యార్థులు తమ జీవితాన్ని ఉత్సవ్‌గా నిర్వహించుకోవడానికి పరీక్షల నుండి ఉత్పన్నమయ్యే ఒత్తిడిని చర్చించి, అధిగమించడానికి దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విదేశాల నుండి ఔత్సాహికులు మరియు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారితో సంభాషించేలా చేసేందుకు ఏర్పాటు చేసిన విశిష్టమైన ఇంటరాక్టివ్ కార్యక్రమమే - 'పరీక్షా పె చర్చ. దీనిని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విషయీకరించారు. ఈ కార్యక్రమం ఫార్మాట్ 2021లో మాదిరిగానే ఆన్‌లైన్ విధానంలో ఉండాలని ప్రతిపాదించబడింది. 9 నుండి 12 తరగతుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్ పోటీ ద్వారా దీనికి ఎంపిక చేయబడతారు. ష్టబిబిజూఱ://తినినినీలజీబివతినితతిజీ.ఎఎనీల.తిని/జూజూఱ-2022/లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 28 డిసెంబర్ 2021 నుండి 3 ఫిబ్రవరి, 2022 వరకు అందుబాటులో ఉంటుంది.

మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌కు షోకాజ్ నోటీస్..

ఆదిలాబాద్ జనవరి 29:కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావుకు పార్టీ హైకమాండ్ షోకాజ్ నోటీసు జారీచేసింది. మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ పర్యటన సందర్భంగా ఆందోళన విషయంలో టీ.కాంగ్రెస్ కమిటీ షాకాజ్ నోటీసు జారీ చేసింది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రేమ్ సాగర్ రావు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సొంత పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న ఆయన.. అసమ్మతి నేతగా వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. టీపీసీసీ కొత్త నాయకత్వం వచ్చాక వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. తాజాగా సీనియర్ నేత వీహెచ్ హన్మంతరావు పర్యటన సందర్భంగా ఏర్పడిన వివాదంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు.

ప్రేమ్ సాగర్ రావు కాంగ్రెస్ పార్టీలో ఏఐసీసీ కార్యదర్శి లాంటి కీలక పోస్టులో ఉన్నారు. ఆయన భార్య కొక్కిరాల సురేఖ మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్నారు. పార్టీలో ఆయన కీలకంగా ఉండగా.. తాజాగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో అటు పార్టీకి, ఇటు కార్యకర్తలకు ఇబ్బందిగా మారుతోంది. అటు రాష్ట్ర అధ్యక్షుడితో పాటు ఇటు ఉమ్మడి జిల్లాలో కీలక నాయకులతో ఆయనకు విభేదాలున్నాయి.

రేవంత్ రెడ్డి పీసీసీ పదవి చేపట్టిన తర్వాత తనకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రేమ్ సాగర్ రావు ఆగ్రహంగా ఉన్నారు. దీంతో తాను కాంగ్రెస్ పార్టీ వీడుతానని, కొత్త పార్టీ పెడతానని సంచలన ప్రకటన చేశారు. ఆయన తీసుకునే నిర్ణయాలు నచ్చని ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు టీఆర్ఎస్‌లోకి వెళ్లారు. కొద్ది రోజుల కిందట కళ్లాల వద్దకు కాంగ్రెస్ పేరుతో పార్టీ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు, ఇతర నేతలు హాజరయ్యారు. వారు ఆందోళన నిర్వహించి కలెక్టరేట్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అయితే ప్రేమ్ సాగర్ రావు అనుచరులు వీహెచ్‌తో సహా పలువురు నేతలను అడ్డుకున్నారు. దీంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పంపితేనే తాను వచ్చానని తనను అడ్డుకోవడం ఏమిటని ప్రేమ్ సాగర్ రావు వర్గంపై అసహనం వ్యక్తం చేశారు. అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అన్నట్లుగా ఆయన సోనియాగాంధీ తదితర నేతలకు లేఖ రాశారు. ఈ నెల 26వ తేదీ వరకు ప్రేమ్ సాగర్ రావుపై చర్యలు తీసుకోకపోతే గాంధీ భవన్ ఎదుట నిరసన దీక్ష చేస్తానంటూ హెచ్చరించారు. దీంతో అధిష్టానం నష్ట నివారణ చర్యలు చేపట్టింది. మరోవైపు అధిష్టానం చర్యలను బట్టి తమ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ప్రేమ్ సాగర్ రావు అనుచరులు చెబుతున్నారు.

వ్యవసాయ రంగంలో సహకారాన్ని మరింత విస్తరించడానికి భారత్ - ఇజ్రాయెల్ ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 29:భారతదేశంలోని ఇజ్రాయెల్ రాయబారి శ్రీ నూర్ గిలోన్, కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్‌ను 27 జనవరి 2022న కృషి భవన్‌లో కలిశారు. భారతదేశంలో ఇజ్రాయెల్ రాయబారిగా బాధ్యతలు స్వీకరించినందుకు శ్రీ తోమర్ ఆయనకు అభినందనలు తెలిపారు. భారతదేశం, ఇజ్రాయెల్ మధ్య దౌత్య సంబంధాలు 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు శ్రీ తోమర్ సంతోషం వ్యక్తం చేశారు. 12 రాష్ట్రాల్లో 25 మిలియన్లకు పైగా కూరగాయల మొక్కలు, 387 వేలకు పైగా నాణ్యమైన పండ్ల మొక్కలను ఉత్పత్తి చేస్తున్న 29 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పనితీరుపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. సంవత్సరానికి 1.2 లక్షల మందికి పైగా రైతులకు శిక్షణ ఇవ్వగలుగుతున్నారని అన్నారు.

ఇజ్రాయెల్ సాంకేతిక సహకారంతో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా ఉన్న 150 గ్రామాలను శ్రేష్టమైన గ్రామాలుగా అంటే విలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్చాలని నిర్ణయించామని, అందులో 75 గ్రామాలను భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల స్మారకార్థం మొదటి సంవత్సరంలోనే చేపడతామని కేంద్ర మంత్రి శ్రీ తోమర్ తెలిపారు. ఈ లక్ష్యంగా భారత్, ఇజ్రాయెల్ కలిసి పని చేస్తాయి. రైతుల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం ప్రారంభించిన వివిధ పథకాలు, పీఎం-కిసాన్, అగ్రి-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, 10 వేల ఎఫ్‌పీఓల ఏర్పాటు, వంటి పథకాలను కూడా శ్రీ తోమర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. సెంట్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయం, భూసార నాణ్యత కార్డులు మొదలైన వాటిని కూడా వివరించారు.

ఇజ్రాయెల్ రాయబారి శ్రీ గిలోన్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇవి రెండు దేశాల మధ్య సహకారానికి గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐసిఏఆర్ ఇన్‌స్టిట్యూట్‌ల పనితీరును రాయబారి ప్రశంసించారు. ఐసిఏఆర్ తో మరింత సహకారం మరియు ఇజ్రాయెల్‌తో అందుబాటులో ఉన్న తాజా సాంకేతికతలను అందుబాటులోకి తీసుకు రావడానికి ఆసక్తిని కనబరిచారు. రైతులకు అందజేస్తున్న ప్రమాణాలు మరియు సేవల నాణ్యతను మరింత పెంచేందుకు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సర్టిఫికేషన్ ను ఆయన ప్రతిపాదించారు. ఇజ్రాయెల్‌లో పర్యటించాల్సిందిగా కేంద్ర మంత్రి శ్రీ తోమర్‌ను కూడా ఆయన ఆహ్వానించారు. శ్రీ తోమర్ రాయబారి ప్రతిపాదనలను ప్రశంసించారు, వాటిపై పని చేయడానికి అంగీకరించారు.

"స్లీపింగ్ జెయింట్స్" అనే అంశంపై వెబినార్ నిర్వహించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 29:"ఆజాదీ-కా-అమృత్-మహత్సవ్" లో భాగంగా, భారత ప్రభుత్వ మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖకు చెందిన మత్స్య విభాగం ఈ రోజు "కేజ్ ఆక్వాకల్చర్ ఇన్ రిజర్వాయర్: స్లీపింగ్ జెయింట్స్" అనే అంశంపై వెబినార్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వం (జి.ఓ.ఐ) మత్స్య శాఖ (డి.ఓ.ఎఫ్) కార్యదర్శి శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్ అధ్యక్షత వహించారు. జి.ఓ.ఐ. మత్స్య శాఖతో పాటు, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాల మత్స్య శాఖల అధికారులు, వివిధ వ్యవసాయ, పశువైద్య, మత్స్య సంబంధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, శాస్త్రవేత్తలు, వ్యవస్థాపకులు, రైతులు, చేపల చెరువుల యజమానులు, విద్యార్థులు, మత్స్య పరిశ్రమకు చెందిన భాగాస్వాములతో సహా సుమారు వంద మంది ప్రతినిధులు హాజరయ్యారు.

డి.ఓ.ఎఫ్., ఫిషరీస్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీ ఐ.ఏ. సిద్ధిఖీ స్వాగతోపన్యాసంతో వెబినార్ ప్రారంభమైంది. ముందుగా వెబినార్ ఇతివృత్తం గురించి వివరించడంతో పాటు, ప్రముఖ ప్యానెలిస్టులైన, కార్యదర్శి, శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్; సంయుక్త కార్యదర్శి (ఇన్లాండ్ ఫిషరీస్); శ్రీ సాగర్ మెహ్రో; ఐ.సి.ఏ.ఆర్.- సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సి.ఐ.ఎఫ్.ఆర్.ఐ), డైరెక్టర్, డాక్టర్. బి. కె. దాస్ మరియు ఇతర భాగస్వాములను వెబినార్ లో పాల్గొన్న వారికి పరిచయం చేయడం జరిగింది.

కేంద్ర మత్స్య శాఖ కార్యదర్శి శ్రీ స్వైన్ తన ప్రారంభోపన్యాసం లో మత్స్య రంగం అభివృద్ధికి రిజర్వాయర్లు, కేజ్ ఆక్వాకల్చర్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అదేవిధంగా, రైతులకు మంచి రాబడిని నిర్ధారించడానికి, అందుబాటులో ఉన్న మార్కెట్లతో సహా రిజర్వాయర్లలో పటిష్టమైన కేజ్ కల్చర్ వ్యవస్థను కలిగి ఉండాలని శ్రీ స్వైన్ సలహా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా మరియు దేశీయంగా, విజయగాథల ఉదాహరణల గురించి కూడా ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. చేపల పెంపకందారులను ప్రోత్సహించడం ద్వారా, లాభాలను పెంచడం, పెట్టుబడి ఖర్చు తగ్గించడం, జాతుల వైవిధ్యం; రిజర్వాయర్లలో కేజ్ కల్చర్ వ్యవస్థ ల ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచడం మొదలైన అంశాలలో వినూత్న మార్గాలు, విధానాలను అభివృద్ధి చేయాలని కూడా శ్రీ స్వైన్, శాస్త్రవేత్తలను రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాల మత్స్య శాఖలను కోరారు.

జె.ఎస్. (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్), శ్రీ సాగర్ మెహ్రో, ముందుగా ప్రసంగిస్తూ, బోనుల వంటి ఎన్ క్లోజర్ లను ఉపయోగించి చేపల ఉత్పత్తి ని పెంపొందించడంలో రిజర్వాయర్ ఫిషరీస్, ఆక్వాకల్చర్ ప్రత్యేకతలను క్లుప్తంగా వివరించారు. నీటి వనరులను వాటి సహజ ఉత్పాదకతను ఉపయోగించడం ద్వారా కేజ్ విధానం సమర్థవంతంగా ఉపయోగపడుతుందనీ, ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణపరంగా లాభదాయకంగా ఉంటుందనీ, శ్రీ మెహ్రో తెలియజేశారు. ఫ్లాగ్ షిప్ పథకం - ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన (పి.ఎం.ఎం.ఎస్.వై) కింద కేజ్ ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వ మత్స్య శాఖ, పెట్టుబడి లక్ష్యాలను నిర్ణయించింది.

సాంకేతిక విభాగంలో ఐ.సి.ఏ.ఆర్.-సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సి.ఐ.ఎఫ్.ఆర్.ఐ) డైరెక్టర్, డా.బి.కె. దాస్, "కేజ్ ఆక్వాకల్చర్ ఇన్ రిజర్వాయర్: స్లీపింగ్ జెయింట్స్" అనే అంశంపై సమగ్రంగా తెలియజేశారు. రైతులు, ఇతర భాగస్వాముల కోసం నిర్వహించిన వివిధ నైపుణ్య, సామర్థ్య అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేజ్ ఆక్వాకల్చర్ వైవిధ్యీకరణ కోసం ఐ.సి.ఏ.ఆర్.-సి.ఐ.ఎఫ్.ఆర్.ఐ. అభివృద్ధి చేసిన వివిధ సాంకేతికతలు, అవకాశాలు, కార్యకలాపాల గురించి కూడా ఆయన వివరించారు. మంచి నిర్వహణ పద్ధతులను అనుసరించి, సహాయక సేవలను అందించడం ద్వారా దేశంలోని రిజర్వాయర్లలో కేజ్ ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని డాక్టర్ దాస్ నొక్కి చెప్పారు. మత్స్య పరిశ్రమకు చెందిన వివిధ దృక్కోణాల కోసం సాంకేతిక నేపథ్యంపై విషయ పరిజ్ఞాన మద్దతు కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో కలిసి సహకరించడానికి సి.ఐ.ఎఫ్.ఆర్.ఐ. సిద్ధంగా ఉందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ప్రదర్శన అనంతరం మత్స్యకారులు, పారిశ్రామికవేత్తలు, హేచరీ యజమానులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయ బోధనా సిబ్బంది తో బహిరంగ చర్చా కార్యక్రమం జరిగింది. చర్చా కార్యక్రమం అనంతరం, డి.ఓ.ఎఫ్. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఎస్.కె. ద్వివేది వందన సమర్పణతో, వెబినార్ దిగ్విజయంగా ముగిసింది.

రైల్వే పరీక్షపై ఆందోళనలను పరిష్కరిస్తామని అభ్యర్థులు/ఆశావహులకు రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ హామీ

న్యూఢిల్లీ, జనవరి 29:ఆర్ ఆర్ బి ల కేంద్రీకృత ఉపాధి నోటీసు (సిఈఎన్) నెం. 01/2019 (నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీలు - గ్రాడ్యుయేట్ , అండర్ గ్రాడ్యుయేట్ కొరకు) కింద జరుగుతున్న నియామక పరీక్ష రెండవ దశకు అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసే ప్రక్రియపై కొంతమంది అభ్యర్థులు ఆందోళనలు లేవనెత్తారు - దీని ఫలితాలు 14.01.2022 న వెలువడ్డాయి.

ఈ విషయంపై శ్రీ అశ్వినీ వైష్ణవ్ డిడి న్యూస్ తో మాట్లాడుతూ, ఈ సమస్యను సున్నితంగా పరిష్కరిస్తామని చెప్పారు. అభ్యర్థుల ఆందోళనలను పరిశీలించడానికి సీనియర్ అధికారులతో కూడిన ఉన్నతాధికార కమిటీ ఇప్పటికే అభ్యర్థులు/ఆశావహుల విజ్ఞప్తులు అందుకోవడం ప్రారంభించింది. సీనియర్ రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు (ఆర్ ఆర్ బి) అధికారులు విద్యార్థుల బృందాలను కలుసుకుని వారి విజ్ఞాపన పత్రాలు తీసుకుంటున్నారు. అభ్యర్థులు/విద్యార్థుల సమస్యలన్నీ అత్యంత సున్నితత్వంతో పరిష్కారమవుతాయని, వారు ఎవరి మాటలద్వారా గందరగోళానికి/ప్రభావానికి లోను కానవసరం లేదని మంత్రి హామీ ఇచ్చారు.పరీక్ష రెండవ దశకు షార్ట్ లిస్ట్ చేయాల్సిన అభ్యర్థుల సంఖ్యను వివరిస్తూ, రైల్వే పాత విధానంగా ఎన్ టి పి సి రెండవ దశ పరీక్షకు పిలవాల్సిన అభ్యర్థుల సంఖ్య ఆమోదించబడిన ఖాళీల సంఖ్యకు 10 రెట్లు మాత్రమే నని మంత్రి తెలియజేశారు. ఖాళీల సంఖ్యకు 10 రెట్లు కాల్ చేసిన ఈ సంఖ్యను సిఈఎన్ 03/2015 లో ఖాళీల సంఖ్యకు 15 రెట్లు , సిఈఎన్ 1/2019 లో ఖాళీల సంఖ్యకు 20 రెట్లు పెంచారు, తద్వారా ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి అవకాశం పొందుతారు.దీనిపై ఇంకా వివరిస్తూ, " ప్రతి కేటగిరీని చూస్తే, ప్రతి కేటగిరీలో 20 సార్లు విద్యార్థులు/అభ్యర్థులను ఎంపిక చేశారు" అని శ్రీ వైష్ణవ్ చెప్పారు. సమస్య ఏమిటంటే ఒకటి కంటే ఎక్కువ కేటగిరీలలో ఒకటి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెండవ దశలో ఐదు విభిన్న స్థాయిల సిబిటి ఉన్నందున అర్హత, మెరిట్ , ఆప్షన్ ప్రకారం ఒక అభ్యర్థిని ఒకటి కంటే ఎక్కువ స్థాయికి షార్ట్ లిస్ట్ చేయవచ్చు కనుక, ఏడు లక్షల రోల్ నెంబర్ల జాబితాల్లో ఒకటి కంటే ఎక్కువ పేర్లు కనిపిస్తాయి. ఈ సమస్యను పరిష్కరించవచ్చని, రోడ్డు ఎక్కాల్సిన , రైలుకు నిప్పు పెట్టాల్సిన అవసరం లేదని , రైల్వే మౌలిక సదుపాయాలు ప్రజల ఆస్తి అనే విషయం గుర్తుంచుకోవాలని మంత్రి అన్నారు.ఈ సమస్య కు సంబంధించిన పరిష్కారం గురించి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, అభ్యర్థుల ఆందోళనలు/అభ్యంతరాలు పరిశీలించడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీలో నియామక ప్రక్రియలో విస్తారమైన అనుభవం ఉన్న చాలా మంది సీనియర్ అధికారులు ఉన్నారని చెప్పారు.సంబంధిత విద్యార్థులు/అభ్యర్థుల ఫిర్యాదులు / ఆందోళనలను మూడు వారాల వ్యవధిలో అంటే 16.02.2022 నాటికి కమిటీకి సమర్పించాలని ఆయన సూచించారు. ఆ తరువాత వెంటనే తాము ఒక పరిష్కారాన్ని తీసుకువస్తామని అశ్వినీ వైష్ణవ్ భరోసా ఇచ్చారు.

ఒకే స్థానంకు నామినేషన్లు వేసిన ఆజంఖాన్ భార్య, కొడుకు

న్యూఢిల్లీ, జనవరి 29:దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. అయితే.. అందరి దృష్టి మాత్రం ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంపై ఉంది. యూపీ ఎన్నికలు దేశానికి మార్గనిర్దేశనం చేస్తాయని భావిస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల హడావుడి వేడెక్కింది. మొత్తం యూపీలో 403 సీట్లు ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఏడు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. మార్చి 10వ తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి.

అయితే ఇప్పుడు ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే సమాజ్ వాదీ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎంపీ ఆజంఖాన్ కొడుకు మహ్మద్ అబ్దుల్లా, ఆజంఖాన్ సతీమణి తనీజ్ ఫత్మా ఒకే నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలబడడం చర్చనీయాంశమైంది. వీరిద్దరూ ఈనెల 28తేదీన రామ్ పూర్ జిల్లా సువార్ అసెంబ్లీ స్థానానికి శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎస్పీ అభ్యర్థులుగా వీరు నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం.

ఇక్కడ అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్షమైన ఎస్పీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. అయితే..సమాజ్ వాదీ పార్టీలో కీలక నేతగా ఉన్న ఆజంఖాన్ ప్రస్తుతం జైలులో ఉన్న సంగతి తెలిసిందే. భూ కబ్జాలు, ఇతర ఆరోపణలతో 2020 ఫిబ్రవరి నుంచి జైలులో ఉంటున్నారు. ఆజంఖాన్ తనయుడిపై కూడా పలు ఆరోపణలున్నాయి. ఫోర్జరీ, భూ ఆక్రమణ కేసులో ఆజంఖాన్, ఆయన భార్య, కుమారుడిపై ఆరోపణలు రావడంతో వీరు రామ్ పూర్ కోర్టులో లొంగిపోయారు. అనంతరం ఫత్మాకు 2020లో బెయిల్ రాగా..అబ్దుల్లా ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యారు. ఆజంఖాన్ ఎన

ఒడిశాకు వెళ్లే పూరీ రైలులో మంటలు.. ప్రయాణికులు అంతా సేఫ్....

ముంబయి, జనవరి 29:మహారాష్ట్రలోని నందుర్‌బార్ స్టేషన్ సమీపంలో గాంధీధామ్ పూరీ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయి. ఇవ్వాల ఉదయం 10.30 గంటలకు రైలు ప్యాంట్రీ కోచ్‌లో మంటలు చెలరేగాయని, ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. నందుర్‌బార్ స్టేషన్ నుండి బయలుదేరిన తర్వాత పూరీ (ఒడిశా)కి వెళ్లే రైలు ప్యాంట్రీ కార్ నుండి మంటలు వ్యాపించాయని, వెంటనే అగ్నిమాపక దళాలు వచ్చి మంటలను ఆర్పేసినట్టు రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.

ప్యాంట్రీ కారులో మంటలు రాగానే ఆ కోచ్‌ని రైలు నుంచి వేరు చేశామని, రైలు మొత్తం 22 కోచ్‌లతో ఉందని అధికారులు తెలిపారు. వెంటనే వైద్య బృందం, ఇతర పారామెడికల్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ ఘటనపై రైల్వే ఉన్నతాధికారులు సమీక్షించారు. మంటలు ఆర్పేశారు, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పశ్చిమ రైల్వే స్పష్టం చేసింది.

పండ్లు ఫ్రీ గా ఇస్తేనే బస్సు ఎక్కాలే.. డ్రైవర్? వాదనతో నిరసనకు దిగిన రైతు..

నాగర్ కర్నూలు, జనవరి 29:నాగర్ కర్నూలు జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండలం మారేడు మాన్ దిన్నె గ్రామం.. నల్లమల అడవి సమీపంలోని మారుమూల గ్రామం.. ఈ గ్రామానికి కేవలం ఒకే ఒక బస్సు వెళుతుంది.. అయితే గ్రామానికి చెందిన రైతు గోపయ్య తన వ్యవసాయ పొలంలో పండించిన బొప్పాయి పండ్లను ప్రతినిత్యం కొల్లాపూర్ పట్టణానికి బస్సులో తీసుకువెళ్లి, అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా బొప్పాయి పండ్లను బస్సులో తీసుకువెళ్లేందుకు రోడ్డుపై పెట్టుకోగా, తనకు ఉచితంగా రైతు పండ్లు ఇవ్వలేదని ఆగ్రహంతో ఆబస్సు డ్రైవర్ కోపంతో ఆ రైతు పండించిన బొప్పాయి పండ్లను బస్సులోకి ఎక్కించుకోలేదు. నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు. దీంతో ఆవేదనకు లోనైన రైతు గోపయ్య ఆ బస్సు కొల్లాపూర్ నుండి తిరిగి గ్రామానికి వచ్చిన సమయంలో రోడ్డుపై బొప్పాయి పండ్లతోపాటు ఇలా బైఠాయించి గంట పాటు నిరసన వ్యక్తం చేశాడు.

ఆర్టీసీ ఎండీగా వీసీ సజ్జనార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత చాలా మెరుగైన పరిస్థితి కనిపిస్తోంది. తెలంగాణ ఆర్టీసీ అంటే ఇప్పుడు అందరూ గౌరవిస్తున్నారు. కానీ, ఇట్లాంటి కొంతమంది సిబ్బంది చేస్తున్న చిల్లర పనులతో ఆర్టీసీపై ఉన్న అభిమానం కాస్త పోయేలా ఉంది. "సజ్జనార్ సర్.. జర చూడుర్రి.. ఇట్లైతే మీ ఆశయానికి గండి పడ్డట్టే అయితది".. అని చాలామంది ఫైర్ అవుతున్నరు.

గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ స్వీకరించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.పద్మజారెడ్డి

హైదరాబాద్, జనవరి 29:ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చాలా గొప్ప కార్యక్రమమని, చెట్లు నాటడం అంటే దైవకార్యంతో సమానమని పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.పద్మజారెడ్డి అన్నారు. రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా బేగంపేటలోని తన నివాసంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.పద్మజారెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డా.పద్మజారెడ్డి మాట్లాడుతూ? ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతున్నారని, తాను మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. చెట్లు అంటే చాలా ఇష్టమన్నారు. తమ ఇంటి వద్ద, వ్యవసాయ క్షేత్రంలో ఎన్నో చెట్లు నాటామని గుర్తు చేశారు. మొక్కలు పెరిగి పెద్దయి తల్లిలా చూసుకుంటాయని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనన్ని మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వం ఇల్లు కట్టుకునేముందు ప్రతి ఒక్కరూ తమ ఇంటివద్ద చెట్లు నాటాలని ఒక రూల్ తెస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తన స్నేహితులు ప్రతిభ, వనజ, ఉమరాణి కి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ విసిరారు.

భారతదేశంతో పాటు యూఎస్ఏలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు & శాస్త్రవేత్తలు స్పేస్ రేడియేషన్ వాతావరణం గురించి చర్చించారు

న్యూఢిల్లీ, జనవరి 29:"స్పేస్ రేడియేషన్ వర్క్‌షాప్: రేడియేషన్ క్యారెక్టరైజేషన్ ఫ్రమ్ సన్‌టు ఎర్త్, మూన్, మార్స్ అండ్ బియాండ్" అనే అంశంపై జనవరి 24 నుండి 28, 2022 వరకు నిర్వహించబడిన ఇండో-యుఎస్ వర్క్‌షాప్‌లో భారతదేశం మరియు యూఎస్‌కు నుండి డొమైన్ నిపుణులు మరియు విద్యార్థులు అంతరిక్ష రేడియేషన్ వాతావరణాన్ని వర్గీకరించడం నుండి ఆస్ట్రోబయాలజీ మరియు అందులో కృత్రిమ మేధస్సు మరియు యంత్ర అభ్యాస సాధనాల అప్లికేషన్ వరకు అనేక అంశాలపై చర్చించారు.

ఇస్రో మాజీ ఛైర్మన్ శ్రీ కిరణ్ కుమార్ జనవరి 26, 2022న తన ముఖ్య ఉపన్యాసంలో భారతదేశం గతంలో చేసిన అంతరిక్ష యాత్రల యొక్క అవలోకనాన్ని అందించారు. అలాగే 2025 వరకు కొత్త మిషన్ల యొక్క రోడ్‌మ్యాప్‌ను అందించారు. పరిమిత వనరులతో ఇస్రో నిరాడంబరమైన ప్రారంభంతో ఎలా ప్రారంభించబడిందో ఆయన హైలైట్ చేశారు. ఇస్రో చేసిన కొన్ని ముఖ్యమైన అంతరిక్ష యాత్రల గురించి వివరించారు.

ఇస్రోకు చంద్రయాన్-1 ఒక ముఖ్యమైన మిషన్ అని అది చంద్రునిపై ఓహెచ్ మరియు నీటి అణువుల ఆవిష్కరణతో పాటు మనకు చంద్రుని గురించి మన అవగాహనను మార్చిందని ఆయన అన్నారు. "మార్స్ ఆర్బిటర్ మిషన్ అంగారక గ్రహంపై అధ్యయనం చేస్తూ 7 సంవత్సరాలు పూర్తి చేసింది. ఆస్ట్రోశాట్ మిషన్ భారతదేశం కక్ష్యలోకి ప్రవేశపెట్టిన మొదటి అంకితమైన ఖగోళ అబ్జర్వేటరీ. ఇది అనేక జాతీయ సంస్థల మధ్య పెద్ద సహకారం మరియు ఖగోళ పరిశోధనలో పెద్ద సంఖ్యలో ముఖ్యమైన అధ్యయనాల కోసం డేటాను అందించింది. చంద్రయాన్ 2 ఆర్బిటర్ చక్కగా ఉంది మరియు అన్ని పేలోడ్‌లు పని చేస్తున్నాయి. అంతరిక్ష నౌక ఇంకా చాలా సంవత్సరాలు పని చేస్తుంది. ఇప్పటి వరకు పొందిన డేటా అనేక ప్రచురణలకు దారితీసింది, "అన్నారాయన. సూర్యునిపై అధ్యయనం చేసే ఆదిత్య-ఎల్1 మిషన్‌కు సంబంధించిన ఉపగ్రహం తయారీ పూర్తవుతుందని, ఈ ఏడాది ప్రయోగించే అవకాశం ఉందని కూడా ఆయన సూచించారు. భవిష్యత్తులో ఇస్రో మరియు జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా) చంద్రుని అన్వేషణ మిషన్‌లో కలిసి పనిచేస్తాయని కూడా ఆయన చెప్పారు.

ఈ వర్క్‌షాప్‌కు ఇండో-యుఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫోరమ్ మద్దతు ఇచ్చింది మరియు ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అబ్జర్వేషనల్ సైన్సెస్ (ఎఆర్ఐఈఎస్), నైనిటాల్, భారత ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ ఉ టెక్నాలజీ, మరియు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), పూణే ద్వారా నిర్వహించబడింది. ఇది ఎఆర్ఐఈఎస్‌లో "భారత స్వాతంత్ర్యం యొక్క 75 సంవత్సరాలు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" స్మారక కార్యక్రమాలలో ఒక భాగంగా నిర్వహించబడింది.

5-రోజుల వర్క్‌షాప్‌లో ప్రతి రోజు భూమి, గాలి మరియు అంతరిక్షయానం, అన్వేషణ, అంతరిక్ష రేడియేషన్ ఉ జీవశాస్త్రం, అంతరిక్ష పరిస్థితుల అవగాహన ఉ అవకాశాలు అనే థీమ్ ఉంది. ఇందులో కాస్మిక్ కిరణాలు, సౌర పర్యవేక్షణ, అంతరిక్ష అన్వేషణ, అంతరిక్ష వాతావరణం మరియు ఉపగ్రహాలు మరియు వ్యోమగాములపై దాని ప్రభావాలు, ఖగోళ జీవశాస్త్రం, ఆయా ప్రాంతాలలో పనిచేసే నిపుణుల బెలూన్ ఆధారిత అధ్యయనాలు వంటి అనేక రకాల చర్చలు ఉన్నాయి. ఆధునిక డేటా విశ్లేషణలు మరియు మోడలింగ్ టెక్నిక్‌లలో ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్ టూల్స్ అప్లికేషన్‌పై హ్యాండ్-ఆన్ సెషన్‌లు కూడా నిర్వహించబడ్డాయి. ఈ వర్క్‌షాప్‌లో భారతదేశం మరియు యూఎస్ఏ నుండి ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొన్న యూఎస్-ఇండియా అంతరిక్ష పరిశోధన సంభాషణ సెషన్ కూడా ఉంది.

పండిత్ జస్ రాజ్ కల్చరల్ ఫౌండేషన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రధాన మంత్రి ప్రసంగం

న్యూఢిల్లీ, జనవరి 29:భారతదేశ శాస్త్రీయ సంగీతం లో అనుభవజ్ఞ?డు పండిత్ జస్ రాజ్ గారి జయంతి సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయన కు ఘనం గా శ్రద్ధాంజలి ఘటించారు. పండిత్ జస్ రాజ్ ద్వారా సంగీతం తాలూకు అమర శక్తి మూర్తిమంతం కావడాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. ఆ విద్వాంసుని వైభవోపేతమైనటువంటి వారసత్వాన్ని జీవం ఉట్టిపడేటట్టు పరిరక్షిస్తున్నందుకు గాను దుర్గ జస్ రాజ్ గారి ని, పండిత్ శారంగ్ దేవ్ గారి ని ప్రధాన మంత్రి ప్రశంసించారు. ప్రధాన మంత్రి వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా పండిత్ జస్ రాజ్ కల్చరల్ ఫౌండేషన్ ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

భారతదేశ సంగీత పరంపర తాలూకు విజ్ఞ?లు బోధించిన విస్తృత జ్ఞానాన్ని గురించి ప్రధాన మంత్రి తన ప్రసంగం లో ప్రస్తావించారు. విశ్వ శక్తి ని గురించిన ఎరుక ను సాధించడాని కి, మరి అదే విధం గా విశ్వం ఉనికి లో సంగీతాన్ని గమనించగల సామర్థ్యమే భారతదేశ శాస్త్రీయ సంగీత సంప్రదాయానికి ఎంతో అసాధారణత్వాన్ని సంపాదించిపెడుతోందని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

"సంగీతం అనేది మన ప్రాపంచిక కర్తవ్యాల ను గురించి మనకు తెలియజెప్పేటటువంటి ఒక సాధనం గా ఉంది, అలాగే ప్రాపంచిక అనుబంధాల ను అధిగమించడం లో కూడాను సంగీతం మనకు సహాయకారి అవుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

భారతదేశం యొక్క ఘనమైనటువంటి కళా వారసత్వాన్ని, అలాగే సంస్కృతి సంబంధి వారసత్వాన్ని పరిరక్షించాలని పండిత్ జస్ రాజ్ కల్చరల్ ఫౌండేషన్ లక్ష్యాన్ని పెట్టుకొన్నందుకు గాను ప్రధాన మంత్రి ప్రశంస ను వ్యక్తం చేశారు. సాంకేతిక విజ్ఞాన ప్రధానమైన వర్తమాన యుగం లోని రెండు కీలకమైన దృష్టికోణాల పట్ల శ్రద్ధ తీసుకోవలసిందని ఫౌండేషన్ కు ఆయన సూచన చేశారు. ఆ రెండు దృష్టికోణాల లో ఒకటో దృష్టికోణం ఏమిటి అంటే అది భారతదేశ సంగీతం నేటి ప్రపంచీకరణ యుగం లో తనదైనటువంటి గుర్తింపు ను ఏర్పరచుకోవాలి అనేదే అని ఆయన చెప్పారు. భారతదేశ వారసత్వం నుంచి ప్రపంచం లబ్ధి ని పొందింది అని యోగ దినం తాలూకు అనుభవం తెలియజేసింది అని ఆయన చెప్పారు. అదే విధం గా భారతదేశ సంగీతాని కి మానవ మేధస్సు యొక్క లోతు ను తరచి చూడగల సామర్థ్యం కూడా ఉందని ఆయన అన్నారు. "ఈ ప్రపంచం లో ప్రతి వ్యక్తి కి భారతదేశ సంగీతాన్ని గురించి తెలుసుకొనేందుకు, భారతదేశ సంగీతాన్ని నేర్చుకొనేందుకు, భారతదేశ సంగీతం యొక్క ప్రయోజనాల ను పొందేందుకు అధికారం ఉంది. ఈ విషయం లో శ్రద్ధ ను తీసుకోవడం మన బాధ్యత" అని ఆయన అన్నారు.

రెండో దృష్టికోణం ఏమిటి అంటే అది సాంకేతిక విజ్ఞానం యొక్క ప్రభావం అంతటా వ్యాపించి ఉన్నటువంటి వర్తమాన యుగం లో సంగీత రంగం లో సైతం సాంకేతిక విజ్ఞానం, ఇంకా ఐటి సంబంధి విప్లవం చోటు చేసుకోవాలి అనేదే అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశ వాద్య పరికరాలు మరియు సంప్రదాయాల పై ఆధారపడినటువంటి సంగీతాని కి పూర్తి గా అంకితం అయి పని చేసే స్టార్ట్-అప్స్ ముందుకు రావాలి అని ఆయన పిలుపు ను ఇచ్చారు.

కాశీ వంటి కళల సంబంధి కేంద్రాల ను, సంస్కృతి సంబంధి కేంద్రాల ను పునరుద్ధరించడం కోసం ఇటీవలి ప్రయత్నాల ను గురించి కూడా ప్రధాన మంత్రి వివరించారు. భారతదేశం పర్యావరణ పరిరక్షణ పట్ల, ప్రకృతి ప్రేమ పట్ల తనకు గల విశ్వాసం ద్వారా ప్రపంచాని కి ఒక భద్రమైన భవిష్యత్తు కు మార్గాన్ని చూపించింది అని ప్రధాన మంత్రి అన్నారు. "వారసత్వం తో పాటుగా అభివృద్ధి దిశ లో సాగుతున్న భారతదేశం ప్రస్థానం లో, 'సబ్ కా ప్రయాస్' ను చేర్చాలి అని చెప్తూ, ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

317 జీవో రద్దు చేయాలని ధర్నా : కాంగ్రెస్ నేతల అరెస్టు

రంగారెడ్డి, జనవరి 29:ఈరోజు 317 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయుల చేపట్టిన ధర్నాకు కాంగ్రెస్ సంఘీభావం తెలిపింది. ఈరోజు కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తుంటే పోలీసులు అరెస్టు నాంపల్లి పోలీస్ స్టేషన్ తరలించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహా రెడ్డి, చేవెళ్ల వసంతం, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, మిర్చేట్ కార్పొరేషన్ కార్పొరేటర్ ఫ్లోర్ లీడర్ చల్ల బాల్ రెడ్డి, సత్యానందం, రాములు, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా సెక్రెటరీ గెల్లా సుభాష్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు అయితరాజు భాస్కర్, రాజు, తదితరులున్నారు.

కేంద్రం నిర్దేశించిన లక్ష్యం కన్నా అధికంగా ధాన్యం సేకరణ

హైదరాబాద్, జనవరి 29:సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ నిర్దేశించిన టార్గెట్ కన్నా అధికంగా ధాన్యం సేకరణ తెలంగాణ రాష్ట్రంలో జరిగిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. దేశవ్యాప్తంగా సేకరించిన 593 లక్షల మెట్రిక్ టన్నులలో 70 లక్షల మెట్రిక్ టన్నులతో తెలంగాణ మూడో స్థానంలో ఉందన్నారు.

ప్రతీ గింజా కొనాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గత సంవత్సరం కన్నా దాదాపు 44 శాతం అధికంగా 21.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా సేకరించామని చెప్పారు. దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల్ని సేకరించి కేంద్రం నిర్దేశించిన దానికన్నా 1.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎక్కువగా సేకరించామన్నారు.

ఇందుకోసం కరోనా క్లిష్ట కాలంలో అత్యధికంగా 6872 కొనుగోళు కేంద్రాల ద్వారా 13,690 కోట్ల విలువగల ధాన్యాన్ని 12.78 లక్షల మంది రైతుల నుండి సేకరించామన్నారు. రెండు రోజుల నుండి అత్యధికంగా వారంలోపే రైతుల ఖాతాల్లోకి నగదును బదిలిచేస్తున్నామన్నారు. గతం కన్నా 5 కోట్ల అధిక గన్నీ సంచుల్ని సకాలంలో అందుబాటులో ఉంచామని, అకాల వర్షాలతో అక్కడక్కడా తేమకు సంబందించిన ఇబ్బందులు మినహా దాన్యం సేకరణ సజావుగా నిర్వహించామన్నారు. అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని సైతం తీసుకుంటున్నామన్నారు మంత్రి. రైతుబందు, రైతుబీమా, 24గంటల ఉచితకరెంటు, కాళేశ్వర జలాలు ఇలా ఎన్నో సంక్షేమ పథకాల్ని సీఎం కేసీఆర్ అమలు చేయడం వల్లే ఇదంతా సాధ్యమయిందని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు.

నిరంతర విద్యుత్ అందించేలా చర్యలు: మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 29:ముచ్చింతల్ లోని త్రిదండీ చినజీయర్ స్వామి ట్రస్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న రామనుజుల స్వామి విగ్రహం యావత్ దేశాన్ని ఆకర్షించే లా రూపుదిద్దుకుందని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. తద్వారా ఈ ప్రాంతం ఆధ్యాత్మిక హబ్ గా మారనుందని చెప్పారు. స్వామి వారి ట్రస్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామనుజుల విగ్రహాన్నిఆవిష్కరించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం మంత్రి జగదీష్ రెడ్డి, టీఎస్ ఎస్‌డీపీఎల్ ఎండీ రఘుమారెడ్డి తదితరులు సందర్శించారు. ఫిబ్రవరి 2 నుండి 14 వరకు జరిగే కార్యక్రమలపై చినజీయర్ స్వామితో కలిసి సమీక్షించారు. ప్రధానితో పాటు ముఖ్యమంత్రులు, గవర్నర్లు వివిధ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున అధికారులు తరలి రానున్నందున విద్యుత్ ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో అధికారులతో ఆయన సమీక్షించారు.రెప్పపాటు కరెంటు పోనీయం.. నిరంతర విద్యుత్ అందించేలా చర్యలు: మంత్రి జగదీశ్‌రెడ్డిఈ సందర్భంగా విద్యుత్ ప్రసారంలో రెప్పపాటు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి జగదీష్ రెడ్డి వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలోని యజ్ఞశాల, బోజన శాలలలో ఏర్పాట్లు చేసిన విద్యుత్ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. పదిరోజుల పాటు జరగనున్న మహోత్సవం లో నిరంతరం విద్యుత్ సరఫరాను సమీక్షించేందుకు ప్రత్యేక విద్యుత్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ విగ్రహ ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు. అందులో బాగంగా విద్యుత్ ప్రసారాలు నిరంతరాయంగ ఉండేలా చూడడంతో పాటు ఎటువంటి అంతరాయం కలుగ కుండా చూడాలని సమీక్షలో పాల్గొన్న అధికారులకు సూచించారు.

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ

రాజన్న సిరిసిల్ల, జనవరి 28:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న తరుణంలో తొలుత రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఫలితంగా వేములవాడ పుణ్యక్షేత్రం నిత్యం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ క్రమంలో శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించే భక్తులతో ఆలయ కల్యాణకట్ట నిండిపోయింది. సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. నిలువెత్తు బెల్లం పంచిపెట్టారు. శుక్రవారం సందర్భంగా లఘుదర్శనం అమలు చేశారు. ఆలయ ఈవో ఎల్.రమాదేవి ఏర్పాట్లు పర్యవేక్షించడంతోపాటు పలుమార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నంలో ఉద్రికత్త రాళ్లు , కర్రలతో దాడి చేసుకున్న టీఆర్ ఎస్, కాంగ్రెస్ నేతలు

రంగారెడ్డి, జనవరి 29:రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఉద్రికత్త నెలకొంది. కాంగ్రెస్, టీఆర్ ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రాళ్లు, కర్రలతో ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. దాంతో పీఎస్ లో టీఆర్ ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. టీఆర్ ఎస్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ధర్నా చేపట్టింది. టీఆర్ ఎస్ నేతలపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ల్యాండ్ వ్యాల్యూ, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు.. ఫిబ్రవరి నుంచి అమల్లోకి..

హైదరాబాద్, జనవరి 29:తెలంగాణలో మరికొన్ని రోజుల్లో పెరిగే రిజిస్ట్రేషన్ చార్జీలు, భూముల విలువ సవరణను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. ఫిబ్రవరి 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. వ్యవసాయ భూముల మార్కెట్ విలువను 50శాతం, ఖాళీ స్థలాల విలువను 35శాతం, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ విలువను 25నుంచి 30శాతం పెంచుతూ రిజిస్ట్రేషన్‌ల శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత మార్కెట్ విలువకు అలాగే సవరించిన విలువకు మధ్య వ్యత్యాసం 35 నుంచి 40 శాతం ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇక మరోవైపు వాణిజ్య సముదాయాల్లో కూడా అన్ని ఫ్లోర్‌లకు ఒకే మార్కెట్ విలువను అధికారులు నిర్ణయించారు. స్థలాల విలువల సగటు 35 శాతం పెరిగినట్లు తెలిపారు.

ఇక తక్కువ విలువ ఉన్న ప్రాంతాల్లో 50 శాతం, అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగుకు 25 నుంచి 30 శాతం దాకా విలువను పెంచారు. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ కూడా 50 శాతం పెరిగింది. సుదీర్ఘ సమీక్ష తర్వాత స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ల శాఖ ఈ ప్రతిపాదనలను తాజాగా జిల్లా రిజిస్ట్రార్లకు పంపింది. అనంతరం రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ రోజు, రేపు ప్రతిపాదనలను ఆమోదించి పంపించేలా చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ..... !

-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, జనవరి 29 (నేటి నిజం ప్రతినిధి) దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ప్ మరియు తెలంగాణ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ మిషన్ ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు 3 నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ నిచ్చి, ఉపాధి కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంగ్లీష్ వర్క్ రెడీ నెస్ అండ్ కంప్యూటర్ కోర్స్ లో కంప్యూటర్ నైపుణ్యత, స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, టైపింగ్, అర్థమెటిక్, హిందీ, గ్రామింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్ శిక్షణ అంశాలుగా ఉంటాయని తెలిపారు.

అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణత , ఇంటర్ ఆపై విద్యార్హతలు కలిగిన వారు అర్హులని తెలిపారు. వయస్సు 19 నుండి 26 సంవత్సరాల లోపు కలిగి ఉండాలన్నారు.

ఫిబ్రవరి ఒకటవ తేదీ (మంగళవారం) నుండి శిక్షణ బ్యాచ్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు.శిక్షణ కాలం లో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగంలో ఉపాధి చూపించడం జరుగుతుందన్నారు.ఆసక్తి, అర్హత గల యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్ లు, రేషన్ కార్డ్ జిరాక్స్ తో పాటు 4 పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో సంగారెడ్డి బైపాస్ రోడ్ లోని బిఎస్ఎన్ఎల్ పక్కన గల పాత డిఆర్డిఏ ఆఫీసు(వెలుగు ఆఫీస్) కు నేరుగా ఫిబ్రవరి 1న ప్రారంభమయ్యే బ్యాచ్ కు హాజరు కావచ్చని ఆయన సూచించారు.

ఇట్టి అవకాశాన్ని జిల్లాలో గల గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొత్త పన్నులు వేయం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జనవరి 29: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తే కొత్త పన్నులేవీ విధించేది లేదని ఆ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. జలంధర్‌లో జరిగిన పొలిటికల్ ర్యాలీని ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఢిల్లీలో తమ ప్రభుత్వం అనుసరిస్తున్న తరహాలోనే పంజాబ్‌లో కూడా బడ్జెట్ రూపొందిస్తామని, బడ్జెట్ తయారు చేయడానికి ముందు సాధారణ ప్రజానీకం, ముఖ్యంగా ట్రేడర్లు, వాణిజ్యవేత్తలు, రైతులు, శ్రామికులు, మహిళలు, యువకులు, ఉద్యోగులతో సహా అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించిన తర్వాతే బడ్జెట్ రూపకల్పన చేస్తామని, అన్ని వర్గాల సమస్యలకు పరిష్కారం బడ్జెట్‌లో ఉంటుందని చెప్పారు. పంజాబ్ శాసన సభ ఎన్నికలు ఫిబ్రవరి 20న జరుగుతాయి. ఓట్ల లెక్కింపు మార్చి 10న ఉంటుంది.

అక్రమ బియ్యం రవాణా పై అడుగడుగునా తనిఖీ

దేవరకొండ, జనవరి 29:: రేషన్ బియ్యం అక్రమంగా తరలించే ముఠాల ఆట కట్టించేందుకు పౌరసరఫరాల శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులను రంగంలోకి దింపింది. ఈమేరకు దేవర కొండలో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకుని జిల్లా ఎన్ ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్ మాచన రఘునందన్ తనిఖీలు ముమ్మరం చేశారు. గత రెండు మూడు రోజులుగా తనిఖీలు కొనసాగుతున్నాయి. పదలకు చేరాల్సిన రేషన్ బియ్యం ఎలా, ఎక్కడి కి పోతున్నాయి, ఎక్కన్నుంచి వస్తున్నాయి, దేని కోసం తీసుకెళు న్నారు. ఇలా పలు ప్రశ్నల తో పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న వారిని అడిగి తెలుసుకుంటున్నారు.

కొండ మల్లె పల్లి నుంచి దేవర కొండ వెళ్లే దారిలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ పలు అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. జనవరి 10న ఓ వాహనం కొండ మల్లె పల్లి నుంచి దిండి లో ఉన్న ఓ మిల్లుకు రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే.. ఇపుడు రైస్ మిల్లుల్లో కనీస మద్దతు ధర కింద ప్రభుత్వనీ సేకరించిన ధాన్యం సైతం కస్టమ్ మిల్లింగ్ బియ్యం కోసం మర పట్టడం జరుగుతోంది. దీంతో ఆయా మిల్లుల్లో ఉన్న లెవీ బియ్యం భద్రత భాధ్యత కూడా ఉండటం తో.. ఏ బియ్యం ఐనా దాని వివరాలు తెలియాల్సిన అవసరం ఉంది అన్నకోణం లో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఏ సరకు ఐనా లెక్కాపత్రం ఉండాల్సిందే అని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వాళ్ళు కట కటాల వెనక్కే వెళ్లాల్సి వుంటుందని హెచ్చరించారు.

నార్త్ అమెరికాలో మంచు తుఫాను.. ప్రమాదకరంగా మారిన పరిస్థితులు

న్యూఢిల్లీ, జనవరి 29:మంచు తుఫానుతో నార్త్ అమెరికా గజగజమణి వణికిపోతుంది. నార్త్ ఈస్ట్, మిడ్ అట్లాంటిక? ప్రాంతాల్లో ఊర్లు, పొలాలు, రోడ్లు, వాహనాలను మంచు దుప్పటి కప్పేసింది. రెండు అడుగుల మేర మంచు పేరుకు పోవడంతో రోడ్లన్ని ప్రమాదకరంగా మారాయి. అత్యవసర పనుల మీద రోడ్ల మీదకు వస్తున్న వాహనాలు స్కిడ్ అవుతున్నాయి. మంచు భారీగా కురుస్తుండటంతో చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు.

శుక్రవారం సాయంత్రం నుంచి శీతలగాలుల తీవ్రతతో కరొలినాస్, అప్పలాంచియా ప్రాంతాల్లో గంటకు వంద కిలోమీటర్ల వేగంతో చలి గాలులు వీస్తున్నాయి. దీంతో స్థానిక అధికారులు స్నో ఎమర్జెన్సీ ప్రకటించారు. బహిరంగ పార్కింగ్‌లను నిషేధించారు.ప్రయాణాలకు మానుకోవాలని సూచించారు. జనవరి ఆరంభంలో వర్జీనియాలో వచ్చిన మంచు తుఫాను సందర్భంగా జరిగిన వందలాది రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ హెచ్చరికలు జారీ చేశారు.

'కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులన్నీ ఫిబ్రవరి 15 లోపు పూర్తవ్వాలి'

హైదరాబాద్, జనవరి 29: బంజారాహిల్స్‌లో నిర్మాణం జరుగుతున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు ఫిబ్రవరి 15 వరకు పూర్తవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి నెలలో మెయిన్ కమాండ్ కంట్రోల్ ను ప్రారంభించాలని సీఎం నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ భవన పనులను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పరిశీలించారు.

అనంతరం ఆయన ఆర్‌అండ్బీ ఈఎన్సీ గణపతి రెడ్డి, ఇతర అధికారులతో కలిసి రివ్యు సమావేశాన్ని నిర్వహించారు. భవనానికి కావాల్సిన ఫర్నిచర్ పై ఆయన పరిశీలించడంతో పాటు పెండింగ్ పనులన్నీ ఫిబ్రవరి 15 లోపు పూర్తవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజు ప్రపోజల్స్‌ను పంపాలి: సాంబశివరెడ్డి

అమరావతి, జనవరి 28: ఏపీలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఫీజు ప్రపోజల్స్‌ను పంపాలని పాఠశాల విద్యానియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ కార్యదర్శి ఆలూరు సాంబశివరెడ్డి పేర్కొన్నారు. 2021-22, 2023-24 పిరియడ్‌కు పీ ప్రపోజల్స్‌ను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలని ఆయన తెలిపారు. దీని కోసం శనివారం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిందన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అన్ని విద్యాసంస్థలు తాము కోరుతున్న ఫీజులను, జమా ఖర్చులను, డాక్యుమెంట్లను, కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఆయన సూచించారు. ఫిబ్రవరి 15 చివరి తేదీ అని, ఈ లోగా వివరాలను అందించాలన్నారు. హైకోర్టు సూచన మేరకు విద్యసంస్థల్లో మౌళిక సదుపాయాలు దృష్టిలో పెట్టుకొని ఫీ స్ట్రక్చర్‌ను సవరిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు కూడా తమ ప్రపోజల్స్‌ను పంపించాలని ఆయన సూచించారు. ఏదైనా విద్యాసంస్థ దరఖాస్తు చేయకపోతే మూడు సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌కు ఫీజుల వసూలును నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

పనితీరు బాగుంది కొనసాగించండి: మంత్రి ఎర్రబెల్లి

ములుగు, జనవరి 29:: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం మొట్లగూడెమ్ గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శిని ఈజీస్ పనుల్లో ఉండటంతో సర్పంచ్ పనస సమ్మయ్యను పిలిపించుకున్నారు. గ్రామ పంచాయతీ పనులను అరా తీశారు. కార్యాలయాన్ని పరిశీలించారు. మొక్కలు నాటి, పరిశుభ్రంగా ఉండటంతో అభినందించారు. మంచినీటి ప్లాంట్ ని ఇంకా వినియోగిస్తున్నారా? మిషన్ భగీరథ మంచినీరు వస్తున్నదా? అని అడిగారు.

భగీరథ నీరు వస్తున్నందున వాటినే వాడాలని సూచించారు. గ్రామ పారిశుద్ధ్యం పై కూడా అరా తీశారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడగడంతో సర్పంచ్, తమకు భూముల పట్టాలు ఇవ్వాలని అడిగారు. దీంతో మంత్రి వాటి విషయమై సీఎం త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

-ప్రభుత్వ శాఖల అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి
-గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి
-బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఆలయ పరిసరాలు, ఇతర ముఖ్య ప్రదేశాల్లో ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాల ఏర్పాటు
-ప్రతీ ఒక్కరూ మాస్కులు ధరించాలి
-పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
-టాఫిక్ నియంత్రణా చర్యలను పకడ్బందీగా చేపట్టాలి

రాజన్న సిరిసిల్ల, జనవరి 29:(నేటినిజం ప్రతినిధి):దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర పుణ్యక్షేత్రంలో జరగబోయే మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 28, మార్చి 1, 2 వ తేదీల్లో జరగనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లపై వేములవాడ ఆలయంలోని ఓపెన్ స్లాబ్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెడికల్ అఫీసర్లు, పారామెడికల్ సిబ్బంది, కమ్యూనిటి హెల్త్ అఫీసర్లను అంబులెన్సు వాహనములు ఏర్పాటు చేయాలని దోమల నివారణకై ఫాగింగ్, స్ప్రే చేయాలని ఆదేశించారు. వైద్య శిబిరాల్లో మాస్కులు, సానిటైజర్, థర్మామీటర్ తప్పకుండా ఉండేలా చూడాలని అవసరమైతే వ్యాక్సినేషన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. దేవస్థానము క్యూలైన్లు, పరిసర ప్రాంతములలో రెస్యూ టీంలను ఏర్పాటు చేయాలని, వీల్ చైర్లు, స్ట్రెచర్ లు అందుబాటులో ఉంచాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, అలాగే పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 126 పర్మనెంట్ టాయిలెట్స్ ఉన్నాయని, మరొక 60 తాత్కాలిక టాయిలెట్స్ జాతర కోసం ఏర్పాటు చేస్తామని అన్నారు. వీటితో పాటు మొబైల్ టాయిలెట్లు ఇతర మున్సిపాలిటీల నుండి తెప్పించి, అన్ని ముఖ్య ప్రదేశాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్టీసీ అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బస్సులను నడపాలని, యాత్రీకుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని అన్నారు. కోవిడ్ నేపథ్యంలో బస్సుల సంఖ్య ఇంకా పెంచేలా చూడాలని అన్నారు. ఉచిత బస్సుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే బస్టాండ్ లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించేలా చూడాలన్నారు. థర్మామీటర్లతో చెక్ చేయాలని సూచించారు. అన్ని పార్కింగ్ స్థలాల వద్ద కంట్రోల్‌రూమ్, సిబ్బందిని ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూముల వద్ద ప్రజా సమాచార వ్యవస్థలు ఏర్పాటు చేసి అనౌన్స్ మెంట్ సౌకర్యములు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆర్టీసీ బస్సులు నిలుపు స్థలాల వద్ద మౌళిక వసతుల కల్పన, సానిటేషన్ నిర్వహణ, పోలీస్ శాఖ వారి సహకారంతో అన్ని పార్కింగ్ స్థలాల వద్ద వాహనాల రాకపోకలకు వేరువేరుగా దారులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల నిర్వహణకు సంబంధించి వేములవాడకు ప్రవేశించే అన్ని రోడ్లు, బైపాస్ రోడ్లు క్లీన్ గా ఉంచాలని, స్పీడు బ్రేకర్లకు రంగులు, సైన్ బోర్డులను అమర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి సౌకర్యములకు సంబంధించి భక్తుల సౌకర్యార్థము చలువ పందిళ్లు వేసి, లైటింగ్, త్రాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని అన్నారు. త్రాగునీటి సౌకర్యాలకు సంబంధించి భక్తులకు సరిపడా సురక్షిత త్రాగునీరు కోసం చలివేంద్రములు ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు అవసరమైన సామాగ్రి, సిబ్బందిని ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సెస్ అధికారులను ఆదేశించారు. అత్యవసర సమయంలో వెంటనే వినియోగించుటకు జనరేటర్లు అందుబాటులో ఉంచాలని సెస్ అధికారులను ఆదేశించారు. పోలీస్

బందోబస్తుకు సంబంధించి, లాడఆర్డర్ నిర్వహణ, ఆలయం లోపల, పరిసర ప్రాంతములందు, అనుబంధ దేవాలయములందు భక్తులు విడిది చేయు ప్రాంతములందు రక్షణ,ట్రాఫిక్ నియంత్రణా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని పోలీస్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దేవాలయములో ప్రస్తుతము ఉన్న రక్షణ వ్యవస్థను పటిష్టపరచాలని అన్నారు. అగ్నిమాపకదళ సేవలకు సంబంధించి, అగ్నిప్రమాదములు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అగ్నిమాపక అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక యంత్రములు పూర్తి సామాగ్రితో గత సంవత్సరము మాదిరిగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేవాలయములో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించాలని, అన్ని కౌంటర్ల దారిని తెలపడానికి సూచికల బోర్డులు ఏర్పాటు చేసి పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా మరియు హ్యాండ్ మైకుల ద్వారా బయటకు వెళ్ళే దారి భక్తులకు తెలియపరచాలని అన్నారు. టికెట్టు కౌంటర్ల వద్ద క్యూలైన్లలో తగు సిబ్బందిని ఏర్పాటు చేసి రద్దీని క్రమబద్ధికరించాలని కలెక్టర్ అన్నారు. గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేసి వారికి అవసరమైన సామగ్రి సమకూర్చాలని మత్స్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న కళ్యాణ కట్టలతో పాటుగా భక్తుల సౌకర్యార్థము అదనముగా వివిధ స్థలములందు అదనపు కళ్యాణ కట్టలను ఏర్పాటు చేయాలని అన్నారు. మద్యపాన అమ్మకమును నియంత్రించాలని సంబంధిత ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల సేవలు వినియోగించుకోవాలని అన్నారు.

జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున పకడ్బందీగా ఏర్పాట్లు చేసి మహా శివరాత్రి జాతర విజయవంతం అయ్యేలా చూస్తామని అన్నారు. లాడఆర్డర్ నిర్వహణ ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యలు పకడ్బందీగా చేపడతామని తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, భక్తుల దర్శనానికి విఘాతం కలగకుండా పోలీస్ శాఖ తరపున పర్యవేక్షణ చేస్తామని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, బి.సత్యప్రసాద్, ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ వి.లీల, డీఎస్పీ చంద్రకాంత్, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కష్ట సమయంలో కనికరం చూపించిన మనసున్న వ్యక్తి గాలిపెల్లి కుమార్

రాజన్న సిరిసిల్ల, జనవరి 29:(నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల. స్వచ్ఛందంగా ఒక ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక ప్రాణాన్ని కాపాడేందుకు 30వ సారి రక్త దానం చేశారు,

అత్యవసర పరిస్థితుల్లో 30 వ సారి రక్తం దానం చేసిన కుమార్ మహారాష్ట్ర, చంద్రాపురు కి చెందిన 24 సం.రాల వయస్సు గల రాణి అనే మహిళకు గర్భసంచి చికిత్స కోసం కరీంనగర్ లో ని సాగర్ హాస్పిటల్లో అడ్మిట్ అవగా, అత్యవసర సమయంలో ఏ పాజిటివ్ రక్తం అవసరం కాగా, వారు బొమ్మకల్ గ్రామానికి చెందిన గాలిపెల్లి కుమార్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, వెంటనే నేనున్నానంటూ హడావుడి గా కేవలం 10 నిమిషాల్లో బ్లడ్ బ్యాంక్ కు చేరుకొని తన అమూల్యమైన రక్తాన్ని దానం చేసి ఒక నిండు ప్రాణాలు కాపాడి మానవత్వం ను చాటుకున్నాడు.

.ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ . ఈ రోజు 30వ సారి రక్తదానం చేసినందుకు చాలా సంతోషంగా ఉంది ,తెలంగాణ లో కరీంనగర్ లో బ్లడ్ రక్తకణాలు ఎప్పుడు అవసరం ఉన్న ఇవ్వటానికి,ఇప్పించటానికి సిద్ధంగా ఉంటా అని అన్నారు

తోట ఆగయ్యను సన్మానించిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జనవరి 29:(నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షునిగా నియామకమైన తోట ఆగయ్య ను శనివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపి సన్మానించి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు ఉన్న వారిలో పలువురు టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు

నేడు జమియతుల్ ఉలేమా రాష్ట్ర అధ్యక్షుడు ముఫ్తి ఖియాసోద్దీన్ రహ్మాణీ రాక

-నీట్ టాపర్లకు ఆత్మీయ సన్మానం

కరీంనగర్ జనవరి 29: (నేటినిజం ప్రతినిధి): జమియతుల్ ఉలేమా ఆధ్వర్యంలో జాతీయ అర్హత పరీక్ష (నీట్) లో 500 మార్కులకు పైగా మార్కులు సాధించిన టాపర్లకు ఆదివారం పికాక్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు జమియతుల్ ఉలేమా జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఏతేమాధుల్ హఖ్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జమియతుల్ ఉలేమా రాష్ట్ర అధ్యక్షుడు ముఫ్తి ఖియాసోద్దీన్ రహ్మాణీ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా ఆరోగ్యమే మన కెసిఆర్ గారి ధ్యేయం

-జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జనవరి 29:(నేటినిజం ప్రతినిధి): కోనరావుపేట మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులలో పాల్గొన్న ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి

కొనారవుపేట మండలంలో సీఎం సహాయనిధి నుండి మంజూరు అయిన 30 మందికి 11 లక్షల 21వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. తర్వాత కొనారవుపేట మున్నూరు కాపు సంఘం దగ్గర జిల్లా ప్రజా పరిషత్ నిధులతో మంజూరి అయిన బోర్ ను వేయటానికి కొబ్బరి కాయ కొట్టి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి ప్రారంభించిరు

ఈ సందర్భంగా గా చైర్ పర్సన్ మాట్లాడుతూ వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కావడం జరిగిందన్నారు. పేద ప్రజలకు ప్రైవేట్ హాస్పిటల్ లో వైద్య ఖర్చులు భారం కాకూడదని మన గౌరవ ముఖ్యమంత్రి వర్యులు కెసిఆర్ చాలా పెద్ద మనసు తో సీఎం సహాయనిధి ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు.తెలంగాణ ప్రభుత్వం వస్తే ఎం వచ్చిందంటే పేదింటి ఆడపిల్లల కల్యాణానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వృద్ధులకు, వితంతువులకు 2000 రూపాయలు, వికలాంగులకు 3000 రూపాయిల పింఛన్, రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు బంధు పథకం, రైతు చనిపోతే రైతు బీమా పథకం, కెసిఆర్ కిట్టు , 24 గంటల ఉచిత కరెంటు, కాలేశ్వరం ద్వారా పంట పొలాలకు సాగునీరు, దళిత బంధు ఇంకా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయన్నారు. దేశములో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన ముఖ్యమంత్రి కెసిఆర్ మన రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ అడగగానే కొనారవ్ పేట మున్నూరు కాపు సంఘానికి లక్ష రూపాయలతో బోర్ మంజూరీ చేసిన జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ×

ఇట్టి కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, వైస్ ఎంపీపీ సుమలత, తెరాస మండల పార్టీ అధ్యక్షులు దేవయ్య, తెరాస సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవ రెడ్డి, పాక్స్ ఛైర్మన్ లు బండ నర్సయ్య, రామ్మోహన్ రావు, సెస్ మాజీ డైరెక్టర్ తిరుపతి, సర్పంచ్లు పోకల రేఖ, మంతెన సంతోష్, కదిరి శ్రీనివాస్, మాట్లా అశోక్, లకావత్ ప్రమీల తిరుపతి, సూర్య నాయక్, వంశిధర్ రావు, సురేష్, లత మహేందర్, ఎంపీటీసీ లు నర్సింహ చారి, మంజుల రవీందర్, తెరాస నాయకులు శ్రీనివాస్, నారాయణ్, శివ తేజ, మున్నూరు కాపు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మొగులయ్యకు రూ. కోటి.. హైదరాబాద్‌లో ఇంటి స్థలం

హైదరాబాద్, జనవరి 29:కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన కిన్నెరమెట్ల కళాకారుడు దర్శనం మొగులయ్యకు తెలంగాణ ప్రభుత్వం తరఫున రూ.కోటి బహుమతిగా ఇస్తున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. హైదరాబాద్‌లో నివాసస్థలం, ఇంటి నిర్మాణం, ఇతరత్రా అవసరాల కోసం ఈ మొత్తాన్ని ఇస్తున్నట్టు తెలిపారు. దర్శనం మొగుల య్య శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి ప్రగతిభవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మొగులయ్య కుశలువా కప్పి సత్కరించారు. గొప్ప కళారూపాన్ని మొగులయ్య కాపాడుతున్నారని ప్రశంసించారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు.

ఇప్పటికే మొగిలయ్య కళను ప్రభుత్వం గుర్తించిందని గౌరవ వేతనాన్ని కూడా అందిస్తున్నదని సిఎం తెలిపారు. హైదరాబాద్‌లో నివాస స్థలం, ఇంటి నిర్మాణం విషయంగా మొగులయ్యతో సమన్వయం చేసుకుని, కావాల్సిన ఏర్పాట్లు చూసుకోవాలని ఎమ్మెల్యే గువ్వల బాలరాజును సీఎం ఆదేశించారు. తెలంగాణ కళలను పునరుజ్జీవం చేసుకుంటూ, కళాకారులను గౌరవిస్తూ వారిని ఆదుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ పునరుద్ఘాటించారు.

గోవా ఎన్నికల ప్రచారంలో రాహుల్.. సీఎం నియోజవకర్గంలో ర్యాలీ

న్యూఢిల్లీ, జనవరి 29:త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గోవాలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పర్యటించనున్నారు. ఫిబ్రవరి 2వ తేదీన రాహుల్ గోవాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ నియోజకవర్గం సాంక్వెలిమ్‌లో వర్చువల్ ర్యాలీ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా రాహుల్ ప్రచారం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికలు జరుగనున్న గోవాలో మొత్తం 40 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. గోవా ముఖ్యమంత్రిగా ప్రమోద్ సావంత్ కొనసాగుతున్నారు.

ఫిబ్రవరి 8న సదరం శిబిరం..!

సంగారెడ్డి, జనవరి 29 (నేటి నిజం ప్రతినిధి)సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నెల మూడవ మంగళవారం రోజున నిర్వహించు సదరం శిబిరాన్ని ఫిబ్రవరి నెల 8న రెండవ మంగళవారం (08.02.2022) నాడు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గాయత్రి దేవి శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

సంబంధిత స్లాట్స్ 1.02.2022న కేటాయించడం జరుగుతుందన్నారు. మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి హాజరు కావాలని ఆమె సూచించారు.

హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం - ఒకరు మృతి

న్యూఢిల్లీ, జనవరి 29:హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒక రోగి మృతి చెందింది. ఈ సంఘటన పశ్చిమ బెంగాల్ లోని బర్డ్వాన్ మెడికల్ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కొవిడ్ వార్డులో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం జరిగింది. కొవిడ్ వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు బయటికి పరుగులు తీశారు. చూస్తుండగానే.. మంటలు వార్డు మొత్తం వ్యాపించాయి. దాదాపు కదల్లేని స్థితిలో ఒక కొవిడ్ రోగి మంటల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయింది. ఆమెను తూర్పు బుర్ద్వాన్ జిల్లాకు చెందిన సంధ్యా రాయ్ (60)గా గుర్తించారు.

దాంతో సంఘటనాస్థలానికి అగ్నిమాపక శాఖ, పోలీసులు చేరుకున్నారు. కొవిడ్ వార్డులో మంటలను అదుపు చేయడానికి దాదాపు గంట సమయం పట్టిందని, ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే కారణాన్ని తెలుసుకోవడానికి ఐదుగురు సభ్యుల దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని, ఫోరెన్సిక్ విచారణ కూడా జరుగుతోందని బుర్ద్వాన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ప్రిన్సిపల్ ప్రబీర్ సేన్‌గుప్తా వెల్లడించారు.

రైతులకు అండగా కాంగ